

5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

ఉరికే చైతన్యం

- ఒంగోలులో 5కే రన్
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ
- కేన్సర్, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



నగరంలో ఆదివారం యువోత్సాహం నెలకొంది. మాదకద్రవ్యాల నివారణ, కేన్సర్‌పై అవగాహన కోసం ఏర్పాటు చేసిన 5కే రన్‌లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాల, టెక్‌బుల్ సంస్థ సంయుక్తంగా స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్ ప్రారంభించి ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ భాగస్వాములయ్యారు.

7



అశ్వ వాహనంపై వేంకటేశ్వరుడు

వైభవంగా నగరోత్సవం

మార్కాపురంలో గుండ్లకమ్మ నదీతీరాన వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ప్రధాన అర్చకులు ఏవీకే నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, అవబృత స్నానం నిర్వహించారు. శ్రీమహావిష్ణువు ప్రధాన ఆయుధమైన సుదర్శన చక్రానికి చక్రస్నానం చేయించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై వేంకటేశ్వరుని నగరోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

\- మార్కాపురం వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి



పూజల్లో పాల్గొన్న భక్తులు

అభివృద్ధి.. సంక్షేమం



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా, వేదికపై మరో మంత్రి గొట్టిపాటి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

అదే లక్ష్యంతో సాగిన జడ్పీ సమావేశం

- ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు మంత్రులు డోలా, గొట్టిపాటి సమాధానాలు
- అధికారులకు సూచనలు, సలహాలు
- ప్రతిపక్ష సభ్యుల్లో కొందరికి చురకలు
- రూ.98.26లక్షల మిగులుతో జడ్పీ బడ్జెట్‌కు ఆమోదం

జిల్లా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం దిశగా సాగింది. అధికారపక్ష శాసనసభ్యులు జిల్లాలోని పలు ప్రధాన అంశాలను సమావేశంలో చర్చకు తెచ్చారు. వీటికి మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్... అధికారుల నుంచి సమాధానాలు రాబడుతూనే కొన్నింటిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల ప్రశ్నలకు మంత్రులు బదులిస్తూనే చురకలు అంటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.98.26 లక్షల మిగులుతో జడ్పీ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.



జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, సభ్యులు

విద్యుత్ సమస్యలపై సుదీర్ఘ చర్చ

పలు నియోజకవర్గాల్లో విద్యుత్ సమస్యలపై సుదీర్ఘ చర్చ నడిచింది. సభ్యులు అనేక విషయాలను ప్రస్తావించారు. దానిపై సంబంధిత శాఖ మంత్రి గొట్టిపాటి స్పందించారు. గతంలో విద్యుత్ శాఖ కారణంగా మరణించిన వారికే ప్రభుత్వం నష్టపరిహారం అందించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో విద్యుత్ కారణంగా ఎవరైనా ఇంటి దగ్గర మృతి చెందినా మానవతా దృక్పథంతో వారి కుటుంబాన్ని ఆదుకుంటున్నామని తెలిపారు.

ప్రొటోకాల్‌పై వైసీపీ సభ్యుల రాద్ధాంతం

నియోజకవర్గాలలో తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఎమ్మెల్సీ మాధవరావు రాద్ధాంతం చేశారు. ప్రభుత్వపరంగా జరిగే కార్యక్రమాలకు తమకు ఆహ్వానం ఉండటం లేదన్నారు. ఆ పార్టీకి చెందిన మరికొంతమంది జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కూడా ఇదే అంశాన్ని సాగదీశారు. ఆ సమయంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య జోక్యం చేసుకుని... గత వైసీపీ హయాంలో కొండపి ఎమ్మెల్యేగా ఉన్న స్వామికి అప్పట్లో ఏమాత్రం గౌరవం ఇచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు.

మంత్రి స్వామి ఆగ్రహం



ప్రొటోకాల్ విషయంలో కొద్దిసేపు వైసీపీ నేతలు చేసిన రాద్ధాంతంపై మంత్రి స్వామి సీరియస్ అయ్యారు. గడిచిన ఐదేళ్లలో చేసిన నిర్వాకం ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులను కనీసం పట్టించుకోకపోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రొటోకాల్ కూడా ఇవ్వలేదని సీరియస్ అయ్యారు. తాము అలాంటి సంస్కృతి పాటించడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజకీయాలకు తావులేకుండా అందరికీ న్యాయం చేస్తూ ముందుకెళ్తున్నామని ఘాటుగా బదులిచ్చారు.

ఒంగోలు కలెక్టరేట్/కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై విస్తృత చర్చ జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఆదివారం ఒంగోలులో సమావేశం జరిగింది. విద్యాశాఖ, ఆర్‌అండ్‌బీ, పౌరసరఫరాలు, సంక్షేమ శాఖలపై సమీక్ష సమయంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, రేషనలైజేషన్, రహదారుల విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం, ఉచిత గ్యాస్ తదితర అంశాలను సభ్యులు ప్రస్తావించారు. ప్రతిపక్షం కన్నా అధికార పార్టీ వారే ఎక్కువ సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రతిపక్షానికి చెందిన పలువురు పాఠశాలల హేతుబద్ధీకరణతోపాటు వసతి గృహాలు, నాడు-నేడు పనుల పూర్తి వంటి అంశాలను ప్రస్తావించారు. వైసీపీ సభ్యులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానాలు ఇస్తూనే చురకలు అంటించారు. 'వైసీపీ హయాంలో చేసిన పాపాలు ఇప్పుడు శాపాలుగా మారాయి. అంతటా సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ పాపాలను ఒకవైపు కడుగుతూనే, మరోవైపు అప్పులు తీర్చుకుంటూ.. ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమం, అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది' అని వారు అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. ఏశాఖలో చూసినా అవినీతి, అప్పులతో నేడు రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందన్నారు. జిల్లాలోని పలు రహదారుల నిర్మాణాలకు టెండర్లు ఖరారు చేసి పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తాము ఆ కాంట్రాక్టర్‌లతో పనులు చేయిస్తున్నామని తెలిపారు. మరోవైపు సంబంధిత శాఖల అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. ఆ విధంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ప్రాధాన్యతా క్రమంలో నడిపించడంతోపాటు ఆయా అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరిగే విధంగా మంత్రులు చొరవ తీసుకున్నారు. ప్రతిపక్షానికి చెందిన ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ నియోజకవర్గానికి చెందిన వసతి గృహాలు, పాఠశాలల గురించి ప్రస్తావించిన సమయంలో మంత్రి డాక్టర్ స్వామి ఘాటుగా సమాధానం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో సింగరాయకొండలో ప్రభుత్వ పాఠశాలను మూసివేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి జిల్లాలో వసతిగృహాల మరమ్మతులకు రూ.20కోట్లు కేటాయించామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు బీపీటీ బియ్యంతో మధ్యాహ్న భోజనం పెట్టేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాల సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

గ్యాస్ సబ్సిడీ అందరికీ వర్తించేలా చూడాలి
- మంత్రి గొట్టిపాటి



గ్యాస్ సబ్సిడీ విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు రాకూడదని పౌరసరఫరాల శాఖ అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నాలుగు లక్షల మంది గ్యాస్ కనెక్షన్‌దారులు ఉండగా, ప్రస్తుతం 3 లక్షల మందికి మాత్రమే సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో పడుతున్నదని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మంత్రి గొట్టిపాటి అధికారుల నిర్వాకంతో ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదన్నారు. టెక్నికల్ సమస్య కారణంగా ఆలస్యమవుతుందని అధికారులు వివరణ ఇచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పరిమళించిన మానవత్వం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి దగ్గరుండి ప్రథమ చికిత్స చేయించిన ఎస్పీ



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులకు దగ్గరుండి ప్రథమ చికిత్స చేయించి వారిని ఆసుపత్రికి తరలించి ఎస్పీ దామోదర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఘటన టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెం సమీపంలో చోటుచేసుకుంది. మేదరమెట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు పచ్చాకు పనుల కోసం తూర్పునాయుడుపాలెం వచ్చారు. ఆదివారం వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై టంగుటూరు వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. ఇద్దరు వ్యక్తులు కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. అదేమార్గంలో వెళ్తున్న ఎస్పీ దామోదర్ ప్రమాదాన్ని చూసి తన వాహనాన్ని ఆపి కిందకు దిగారు. గాయపడిన వారికి సహాయం అందించారు. అంబులెన్స్‌ను పిలిపించి వారికి ప్రాథమిక చికిత్స చేయించారు. అందులోనే ఒంగోలులోని ఆసుపత్రికి పంపించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించి ఆయనపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎస్పీ సపర్యలు చేసి ఆసుపత్రికి పంపిన విషయం తెలుసుకున్న ప్రజలు ప్రశంసిస్తున్నారు.

కన్నకొడుకే కాలయముడై..

- మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు
- పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు
- దొనకొండ మండలం ఇండ్లచెరువులో ఘటన

ఆస్తికోసం ఆగిన అంత్యక్రియలు

- రెండు రోజులుగా ఇంటి వద్దనే యువకుడి మృతదేహం

వివరాలు మెయిన్‌లో



ముగిసిన 'ఫెస్ట్'

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఫెస్ట్-2025 ఆదివారం ఘనంగా ముగిసింది. వివిధ ప్రాంతాల్లోని కాలేజీల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు వారు ప్రదర్శించిన సాంకేతిక ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతులను అందజేశారు.

7

పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ

- రెండ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం



ఒంగోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బోర్డు పరిపాలనా విభాగంలో అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా త్రిపుర కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి బి.విశ్వశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మంత్రిత్వశాఖ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటివరకూ ఈడీగా పనిచేసిన అద్దంకి శ్రీధర్‌బాబు రెండు విడతలుగా ఎనిమిదేళ్ల బాధ్యతల్లో ఉన్నారు. ఆయన డిప్యుటేషన్ గడువు పూర్తికావడంతో కొత్త అధికారిని నియమించారు. తెలంగాణకు చెందిన విశ్వశ్రీ 2014 ఐఏఎస్ బ్యాచ్ కాగా త్రిపుర కేడర్‌కు కేటాయించారు. అక్కడ వివిధ స్థాయిల్లో పనిచేసిన ఆమె ఆ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇప్పుడు పొగాకు బోర్డు ఈడీగా నియమితులయ్యారు. ఆ బాధ్యతల్లో నాలుగేళ్లపాటు కొనసాగనున్నారు. రెండు రోజుల్లో గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో విశ్వశ్రీ బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

ఉత్సాహంగా చెస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో రతన్ టాటా మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. స్థానిక హైదరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోటీల ముఖ్య అతిథిగా హాజరైన దామచర్ల ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. క్రీడల ద్వారా మానసికోల్లాసం, ఆరోగ్యం, పోటీతత్వం అలవడతాయని ఆయన చెప్పారు. కాగా మొదటి రోజు జరిగిన పోటీలకు సుమారు 128 క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, హైదరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్‌రెడ్డి, వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు కందుల కోటి, జేకే.రాజు, శ్రీకాంత్, పూసాపటి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి స్వామి

టి.నాయుడుపాలెం (టంగుటూరు) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. 41 మంది బాధితులకు రూ.43 లక్షల విలువైన చెక్కులను, రూ.8 లక్షలు విలువైన ఎల్‌వోసీ అందజేశారు. జగన్‌ను కుటుంబ సభ్యులు, సొంతపార్టీ నేతలే నమ్మడం లేదని, అందుకే నేతలంతా ఆ పార్టీ వీడుతున్నారని మంత్రి ఆరోపించారు.

పోలేరమ్మ గుడిలో సత్య పూజలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పోలేరమ్మ గుడిలో ఆదివారం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, గిరి, గుడే వెంకటేశ్వర్లు, మల్లికార్జున, నరాల సుధాకర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలని వినతి


భూముల రిజిస్ట్రేషన్ల సమస్యను సత్యకు వివరిస్తున్న టీడీపీ నేతలు

మూలగుంటపాడు గ్రామంతో పాటు మండలంలో నిలిచిపోయిన భూముల రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలని టీడీపీ నేతలు దామచర్ల సత్యను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆగిన పోయిన భూముల రిజిస్ట్రేషన్‌పై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

రహదారి పనుల పరిశీలన


కాంట్రాక్టర్‌కు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

గత 20 సంవత్సరాలుగా అసంపూర్తిగా, వివాదాల కారణంగా పరిష్కారానికి నోచుకోని రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాల మార్కెట్‌కు ఉత్తరం వైపున ఉన్న రోడ్డుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. స్థానికంగా ఆక్రమణలకు గురై, రెండు దశాబ్దాలుగా రాకపోకలు నిలిచిపోవడంతో దామచర్ల దృష్టి సారించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆయా పనులను పరిశీలించారు. నాణ్యత లోపం లేకుండా, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. - ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

చలో ఢిల్లీకి వెళ్లిన ఎల్‌ఐసీ ఏజెంట్లు



ధర్నాకు వెళుతున్న ఏజెంట్లు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి9(ఒంగోలురూరల్): ఎల్‌ఐసీలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ ఎల్‌ఐసీ ఏజెంట్లు ఆదివారం చలో ఢిల్లీ కార్యక్రమానికి ఒంగోలు నుంచి రైలులో తరలివెళ్లారు. ఎల్‌ఐసీఏవోఐ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో ఈనెల 11వ తేదీన ఏజెంట్లు ధర్నా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజశేఖర్, బెజవాడ శివయ్య, బి.వెంకట్రావు, టి.మహేష్, ఎం.తిరుపతినాయుడు, ఎస్‌వీ.సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, శివరామకృష్ణ, పి.మహేష్, తిరుపతయ్య, మాలకొండయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

పరీక్షల మధ్య విరామం.. ఉపశమనం!

- టెన్త్ విద్యార్థులకు ఉపయుక్తం
- ఉత్తీర్ణత శాతం పెంపునకు ప్రభుత్వ నిర్ణయం దోహదం
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం


మైనంపాడు హైస్కూలులో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన క్రమేపి పెరుగుతోంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పగలు, రాత్రి కష్టపడి చదువుతున్నారు. కొందరు పరీక్షల సమయానికి చదివిన వాటిలో కొన్ని మర్చిపోతుంటారు. దీంతో ఆశించిన మార్కులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ఇంకొందరైతే ఆహారం తీసుకోకుండా చదివి నీరశించిపోతారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలని, మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలనే లక్ష్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. ప్రతీ పరీక్షకు మధ్య ఒకరోజు విరామం ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో సంతనూతలపాడు మండలంలో 9 జడ్పీ హైస్కూళ్లు, ఒక ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ కలిపి సుమారుగా 301 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గతంలో పదో తరగతి పరీక్షలను రోజుకొకటి చొప్పున నిర్వహించడం వలన విద్యార్థులు కొంత ఆందోళనకు గురయ్యేవారు. పండుగ వారాంతపు సెలవులు వస్తే తప్ప విరామం ఉండేది కాదు. ఇదిలా ఉంటే కొన్నేళ్ల పాఠ్యాంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి ఒక పేపరు విధానంతో పరీక్షలు జరగడం వల్ల విద్యార్థులపై మరింత భారం పెంచినట్లైంది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చే నెల మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతీ పరీక్షకు మధ్య ప్రభుత్వం ఒక రోజు విరామం ప్రకటించగా గణితం, సాంఘికశాస్త్రం పరీక్షలకు అదనంగా మరొక రోజు విరామం దొరికింది.

పునశ్చరణకు అనుకూలం

పదో పరీక్షలకు ఒక రోజు విరామం రావడం ఇదే తొలిసారి. దీంతో విద్యార్థులు విశ్రాంతి తీసుకుంటూ చదువుకోవడానికి, పూర్తిస్థాయిలో పునశ్చరణ చేసుకోవాడానికి ఉపయోగపడుతుంది. దూర ప్రాంతాల విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి చేరుకునేప్పటికి సాయంత్రం అమవుతోంది. మర్నాడు మళ్లీ పరీక్షకు హాజరుకావాలంటే సహజంగా ఒత్తిడికి గురవుతారు. ప్రభుత్వం తీసుకున్న ఒకరోజు విరామ నిర్ణయం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. వారిలో ఒత్తిడి, ఆందోళన తగ్గి భయం పోతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలి.

- వెంకారెడ్డి, ఎంఈవో, సంతనూతలపాడు

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ ఏఆర్ దామోదర్


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

సింగరాయకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నేరనియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారిలో భరోసాను కల్పించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న సింగరాయకొండ పోలీస్‌స్టేషను తొలగించి దాతల సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కృషిచేయాలని సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్రలకు సూచించారు. ఆదివారం రాత్రి సింగరాయకొండ, జరుగుమల్లి పోలీస్‌స్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సింగరాయకొండ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయంలో పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, నేరనియంత్రణ చేపడుతున్న చర్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రతపై అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసులు, సీఐ హజరత్తయ్య, సింగరాయకొండ, జరుగుమల్లి ఎస్సైలు బి.మహేంద్ర, బత్తుల మహేంద్ర ఉన్నారు.

నిబద్ధత కలిగిన కవి పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు

- సాహితీవేత్తల నివాళి


నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సాహిత్యరంగంలో నిబద్ధత కలిగిన కవిగా, అనేక మంచి రచనలు చేసిన సాహితీవేత్త పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు అని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. ప్రముఖ కవి పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో కళామిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే వయసుతో నిమిత్తం లేకుండా రచనలు చేయవచ్చని వెంకటేశ్వర్లు నిరూపించారు. నాగభైరవ సాహితీపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ వృత్తి రిత్యా హిందీ అధ్యాపకుడైనప్పటికీ చక్కటి తెలుగులో వసుధశతకం, పసిడిపలుకులు, వనగోపాలుడు, మానసబోధ, భక్తిగీతాలు, అమృత వాక్కులు వంటి పలు గ్రంథాలను వెంకటేశ్వర్లు రచించారని చెప్పారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ దేశభక్తి, దైవభక్తి ప్రతిబింబించేలా రచనావ్యాసంగాన్ని కొనసాగించిన కవి పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు అని పేర్కొన్నారు. అనంతరం శనగపల్లి సుబ్బారావు, మద్దిరాల శ్రీనివాసులు, ఆళ్లచెరువు సాంబశివరావు, వీఎస్.సుబ్రహ్మణ్యేశ్వరశర్మలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు పలు రంగాలలో విశేష కృషిచేస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి సత్యవతి, మనవడు కార్తీక్, సాహితీ వేత్తలు కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, పోతుల పెద వీరనారాయణ, నూకతోటి శరత్‌బాబు, యూవీ.రత్నం, ఎంవీఎస్.శాస్త్రి, కప్పగంతు జయరామయ్య, నర్సింగోలు శ్రీనివాసప్రసాద్, బీరం అరుణ, బండారు సునీత తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో పడకేసిన పారిశుధ్యం

- ఇబ్బందిపడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు


బ్యాంకు పక్కబజారులో పేరుకున్న చెత్తాచెదారం


మందుబాబులు కాలువలో పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువల్లో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అయినా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ఎక్కడ మలేరియా, డెంగ్యూ, గున్యా వ్యాధుల బారిన పడతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా సంతనూతలపాడు నుంచి మద్దులూరుకు వెళ్లే రోడ్డులో ఓ బ్యాంకు సమీపంలోని రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ కొందరు మందుబాబులు మద్యం కొనుగోలు చేసి పక్కనే ఉన్న బజారులో మద్యం తాగి రెండువైపుల ఉన్న మురుగు కాలువల్లో ప్లాస్టిక్ గ్లాసులు, నీళ్ల ప్యాకెట్లు గుట్టలుగా పడవేస్తున్నారు. దీంతో స్థానికంగా నివాసం ఉండే కుటుంబాల వారు మందుబాబులు తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులను, ప్యాకెట్లను, సీసాలను ఇష్టమొచ్చినట్లు ఇళ్లసమీపంలో పడేస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మద్దులూరు రోడ్డు మీదుగానే కార్యాలయాలకు వెళ్తుంటారు. కానీ పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించే లా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఊరి సర్వే నంబరు తాకట్టు'పై అధికారుల విచారణ

పుల్లలచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : గ్రామకంఠం భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌పై ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిరంజీవి విచారించారు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆదివారం సైతం విచారణ చేపట్టారు. వైసీపీ నాయకుడు చేయించిన అక్రమ ఆన్‌లైన్‌పై ఆరా తీశారు. మండలంలోని ఇసుక త్రిపురవరం గ్రామ రెవెన్యూలోని సర్వే నెం.296లో 8.36 ఎకరాల భూమి ఉంది. ఆ సర్వే నెంబరులో సిద్దెనపాలెం గ్రామం ఉండగా, అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గడ్డం సుబ్బయ్య 4.32 ఎకరాలను అదేగ్రామానికి చెందిన మరోక వ్యక్తి కోల్లి వీరబ్రహ్మయ్య 4 ఎకరాల భూమిని అక్రమంగా 2020లో ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈ విషయంపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకుడిని అరెస్టు చేశారు. విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


పాతబస్టాండ్ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- చీమకుర్తి బస్టాండ్ సెంటర్‌లో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్
- స్థానికుల భయాందోళన

చీమకుర్తి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది తిరుగాడుతుంటారు. జిల్లా నుంచి పశ్చిమప్రకాశంకు వెళ్లే బస్‌లు, వాహనాలు ఇక్కడే ఆగి వెళ్తుంటాయి. చుట్టుపక్కలా వ్యాపార సముదాయాలు, వీధి వ్యాపారులు ఇక్కడే కూర్చొని అమ్మకాలు సాగిస్తుంటారు.. ఇలాంటిచోట కరెంటు తీగలు బయటకు వేలాడుతూ రక్షణ కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. చీమకుర్తి పట్టణం నడిబొడ్డున పాత బస్టాండ్‌సెంటర్‌లో కర్నూల్‌రోడ్డుకు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనికి పూర్తిస్థాయిలో రక్షణ కంచె వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు ప్రమాదం లేకుండా విద్యుత్‌శాఖ సిబ్బంది చూడాల్సి ఉంది. కనీసం మున్సిపాలిటీ సిబ్బంది అయినా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సింది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటం ప్రాణాంతకంగా మారింది. ఆదివారం ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ వలస కార్మికునికి చెందిన మూడేళ్ల బాలుడు అదృష్టవశాత్తు ప్రాణప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒక పక్క అతడి తల్లి బుడగలు అమ్ముకుంటుండగా పక్కనే ఉన్న బాలుడు విద్యుత్ స్తంభం సమీపం వద్దకు వెళ్లి పట్టుకునే సమయంలో పక్క షాపునకు చెందిన నూకల సుబ్రహ్మణ్యం గుర్తించి పక్కకు లాగటంతో పెద్దప్రమాదం తప్పిపోయింది. ఇకనైనా ఎటైనా ప్రమాదాలు జరగక ముందే విద్యుత్‌శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):మహిళ మెడలో గొలుసును చైన్‌స్నాచర్లు లాక్కొని ఉడాయించిన ఘటన గిద్దలూరులోని ఎన్‌టీఆర్‌కాలనీ వద్ద జరిగింది. పట్టణానికి చెందిన తలారి లక్ష్మీనారాయణమ్మ కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నది. ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి కూల్‌డ్రింక్స్ తాగి డబ్బులు ఇచ్చాడు. డబ్బులు లెక్కిస్తున్న సమయంలో దుండగుడు ఆమె గొంతును గట్టిగా పట్టుకొని మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసును లాక్కొని సమీపంలోనే బైక్‌ను స్టార్ట్ చేసి ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. సీఐ కె.సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సూదనగుంట వారి ఆత్మీయ సమ్మేళనం

మద్దిపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సూదనగుంట వారి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మల్లవరంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామర్ల జనార్దన్ హాజరై ప్రసంగించారు. ఒకే ఇంటిపేరు కలిగిన వారు ఒకచోట కలిసి ఆత్మీయంగా ఉండటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సూదనగుంట నరసింహారావు, కృష్ణమూర్తి, డాక్టర్ సూదనగుంట పేరయ్య, డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, శేషయ్య, మార్నేని రాఘవరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్ర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల గజిటెట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ పి.గోపాలనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం ప్రధానకార్యదర్శిగా ఎం.శ్రీనివాసరెడ్డి, సహాయ అధ్యక్షుడిగా శేషయ్య, ఆర్థిక కార్యదర్శిగా కె.నవీనా, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా సుజాతలను ఎన్నుకున్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు


రేషన్‌షాపును పరిశీలిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒమ్మెవరం గ్రామంలోని 42 నెంబరు రేషన్ దుకాణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ గుణవంశీ ఆదివారం సాధారణ తనిఖీలు చేపట్టారు. సదరు రేషన్‌దుకాణంలో 32 బస్తాల రేషన్‌బియ్యం తక్కువగా ఉండటంతో పాటు 24 పంచదార ప్యాకెట్లు అదనంగా ఉన్నట్లుగా గుర్తించి డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు గుణవంశీ తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

సంతనూతలపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం అదే హైస్కూల్లో సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా దేశవిదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నా వారంత ఒక్కచోట కలిసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం సామూహికంగా భోజనం చేశారు.

న్యాషాభక్తరాజు సేవలు ఆదర్శనీయం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): న్యాషాభక్తరాజు సేవలు ఆదర్శనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఉప్పుగుండూరు మాజీ సర్పంచ్ 41వ వర్ధంతిని స్థానిక భక్తయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన న్యాషాభక్తరాజు 31 ఏళ్ల గ్రామ సర్పంచ్‌గా, 30 ఏళ్ల కోపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా పనిచేసి గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కమ్యూనిస్ట్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి పేద ప్రజలకు అండగా నిలిచారని ఆయన సేవలు కొనియాడారు.యువతను అభ్యుదయ మార్గంలో నడిపించేందుకు బాల, యువజన సంఘాలను స్థాపించి గ్రామగ్రామాన కళారూపాలతో ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, టీడీపీ నాయకుడు కాట్రగడ్డ చంద్రబాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, ఉప్పుగుండూరు శ్రీనివాసప్రసాద్, తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, దీవి శ్రీధర్‌బాబు, భక్తయ్య కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


ఫ్లెక్సీని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మద్దిపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేసి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని సీతారాంపురం కోస్టాల్ దగ్గర, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్‌సెంటర్ వద్ద రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈక్రమంలో ఎస్సై బి.శివరామయ్య, సిబ్బందితో కలిసి కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను డీఎస్పీ పరిశీలించారు. అనంతరం వెల్లంపల్లి-తాళ్లూరు రోడ్‌లో ఉన్న జేఎంజే సినిమా హాలు పరిశీలించి యాజమాన్యానికి పలు సూచనలు ఇచ్చారు.

బాధితులకు న్యాయం చేయాలి

కొండపి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడవరంలోని దళిత సామాజిక తరగతికి చెందిన బండి గోవిందమ్మ కుటుంబానికి ప్రభుత్వ అధికారులు న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. గోవిందమ్మ, భర్తతో కలిసి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటిని నిర్మించుకుని ఉంటున్నదని, అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గోవిందమ్మ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతూ పొగాకు బ్యారన్‌లు నిర్మిస్తున్నారని, అధికారులు వారికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

కొండపి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని మద్దులూరు రోడ్డులోగల కవనెంట్ చర్చిలోని 30 మంది విద్యార్థులకు కట్టావారిపాలెం గ్రామానికి చెందిన 'మన ఊరి వికాసం' సభ్యుడు చింతల వెంకట అఖిల్ బ్యాగ్‌లు ఇచ్చారు. వీటిని ఆదివారం సాయంత్రం కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ అంగలకుర్తి బ్రహ్మయ్య, మన ఊరి వికాసం కార్యకర్తలు కె.లక్ష్మీనరసింహం, వీరమోసు మస్తాన్, రాము, రాఘవులు పాల్గొన్నారు.

రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కొండపి, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో భూమి ఉన్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో విజయ్‌కుమార్ ఒక ప్రకనటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు వచ్చే రాయితీలు, పథకాల అమలుకు తప్పనిసరిగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని 14 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు.

రిటైర్డ్ బ్యాంక్ ఫెడరేషన్ సంఘం నూతన కమిటీ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ బ్యాంక్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా పి.పుష్పరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన ప్రధానకార్యదర్శిగా పి.రాజేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా యూవీ.రత్నం, సీబీరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎ.యల్లారావు, బీవీవీ.కొండలరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని ప్రశంసించిన మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, ఢిల్లీలో జరిగిన ప్రపంచకప్ ఖోఖో పోటీలో విశ్వ విజేతగా నిలిచి భారత్ జట్టులో ప్రాతినిథ్యం పొందిన పి.శివారెడ్డిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సత్కరించారు. ప్రపంచకప్ ఖోఖో పోటీలో భారత్ జట్టులో పాల్గొన్న రాష్ట్ర క్రీడాకారుడు శివారెడ్డికి దీర్ఘకాలం పంగులూరు ఎస్ఆర్ ఆర్ అకాడమీలో శిక్షణ ఇచ్చిన రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి ఆదివారం మంత్రి గొట్టిపాటిని చిలకలూరిపేటలోని ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఖోఖో క్రీడలో అంచెలంచెలుగా ఎదిగి భారత్ జట్టులో తెలుగు రాష్ట్రాల నుంచి స్థానం పొంది భారతజట్టు విజేతగా నిలిచేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నందన్నారు. యువత క్రీడలపట్ల ఆసక్తి చూపాలని, శివారెడ్డి భావి యువతకు ఆదర్శంగా నిలుస్తారని ప్రశంసించారు. రాష్ట్రానికి, జిల్లాకు పేరు తెచ్చిన శిక్షణ ఇచ్చిన పీడీ సీతారామిరెడ్డిని, శివారెడ్డి తండ్రి గురవారెడ్డిని అభినందించారు. ప్రపంచకప్ ఖోఖో పోటీలలో శివారెడ్డికి బెస్ట్ చేజర్ అవార్డ్ పొందిన విషయాన్ని కార్యదర్శి సీతారామిరెడ్డి మంత్రి గొట్టిపాటికి వివరించారు. కార్యక్రమంలో పంగులూరు టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పలువురు ఖోఖో క్రీడాకారులు పాల్గొన్నారు.



శివారెడ్డిని అభినందిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

'గుర్తు'కొస్తున్నాయి..

చదువుకునే రోజులను గుర్తుచేసుకున్న ఆనాటి విద్యార్థులు
జ్ఞాపకాలు, అనుభవాల సమ్మేళనంతో సాగిన కార్యక్రమం
ఘనంగా మద్దిపాడు కడియాల యానాదయ్య జూనియర్ కళాశాల, పాఠశాల స్వర్ణోత్సవం

బాల్య జ్ఞాపకాలు ఎప్పటికీ చెదరిపోనివి.. ఎన్నటికీ చెరగిపోనివి.. ఏ వయస్సులోనైనా సరే, వాటిని ఒక్కసారి నెమరువేసుకుంటే చిన్నపిల్లలుగా మారిపోతారు. పాఠశాలలో, కళాశాలలో చదివే రోజులలో చేసిన అల్లరి.. స్నేహితుల ప్రేమాభిమానాలు.. గురువుల దండింపులు.. ఇలా అనేక విషయాలను సహచర విద్యార్థులతో ముచ్చటిస్తూ.. మధురస్మృతులను మననం చేసుకుంటూ వందలాది మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆనందోత్సాహాలతో గడిపారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు అందుకు వేదికగా మారాయి.

మద్దిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వజ్రోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తగిన విధంగా సహకరించాలని చెప్పారు. ప్రభుత్వం చేయూతతోపాటు స్థానికుల సహకారం అందిస్తే ప్రభుత్వ బడులు, కాలేజీలు దినదినప్రవర్ధమానం చెందుతాయన్నారు. రాష్ట్ర మహిళ, బాలికల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ ఈ వేడుకలలో పాల్గొనటం ద్వారా తనకు బాల్యస్మృతులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదివి ఇక్కడి పాఠశాలలో ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయుడిగా 28 ఏళ్లు పనిచేశానని తన హయాంలోనే వజ్రోత్సవాలు, స్వర్ణోత్సవాలు జరగటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి సుద్దపల్లి సుధాకర్ వేడుకలకు హాజరైన వారికి భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కళాశాలలో పనిచేసిన అధ్యాపకులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, జానపద గేయాలు ఆహూతులను అలరించాయి.

ఇక్కడ చదివే ఉన్నత స్థానానికి ఎదిగా

పులి శ్రీనివాస్, ఐఏఎస్, గుంటూరు నగర కమిషనర్



నేను చీమకుర్తి మండలం రాజానగరం నుంచి వచ్చి మద్దిపాడు హాస్టల్లో చేరా. ఇక్కడి కళాశాలలో చదివి ఉన్నత స్థానానికి చేరుకున్నా. అటువంటి కళాశాల స్వర్ణోత్సవంలో పాల్గొనటం, సహ విద్యార్థులను ఎన్నోఏళ్ల తర్వాత కలవటం ఆనందంగా ఉంది.

ప్రతి విద్యార్థి పట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారు

డాక్టర్ బందెల అంజయ్య, రిమ్స్ రిటైర్డ్ డైరెక్టర్



కడియాల యానదయ్య పాఠశాల, కళాశాలలో చదవటం ఎంతో అదృష్టం. నాటి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రతి విద్యార్థి పట్ల ఎంతో శ్రద్ధ తీసుకునేవారు. ఎదుగుదలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు.

● దాదాపు 3,800 మంది హాజరు

పాఠశాల, కళాశాలలో చదివిన దాదాపు 35 బ్యాచ్‌లకు చెందిన 3800 మంది హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్నత స్థాయిలలో ఉన్నవారు, ఉద్యోగం చేసి రిటైర్ అయిన వారు, వ్యాపార రంగంలో స్థిరపడిన వారు ఇలా అనేకమంది బాల్య స్నేహితులను ఒక్కసారిగా చూడడంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



పూర్వ విద్యార్థులు

నిబంధనల మేరకే పాఠశాలల హేతుబద్ధీకరణ

ఉమ్మడి జిల్లాలో హాస్టళ్ల మరమ్మతులకు రూ. 20 కోట్లు మంజూరు
రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు వేగవంతం
భూములు కోల్పోతున్న రైతుల పరిహారానికి ప్రత్యేక చర్యలు
జడ్పీ సమావేశంలో మంత్రులు డాక్టర్ గొట్టిపాటి, స్వామి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలల హేతుబద్ధీకరణలో ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్‌డీఎస్‌బీవీ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు ఆదేశించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం మధ్యాహ్నం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత వహించారు.

సమావేశంలో విద్యాశాఖపై జరిగిన సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల రేషనలైజేషన్ ఉండాలన్నారు. అందుకు భిన్నంగా చేయవద్దని స్పష్టం చేశారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా రేషనలైజేషన్ జరిగితే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఆదేశించారు. జాతీయరహదారుల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో అధికారులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టెండర్లు జరిగి నిర్మాణాలు చేపట్టని రహదారులను కాంట్రాక్టర్లతో చర్చించి వెంటనే ఆ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వసతి గృహాల మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త భవనాల నిర్మాణాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి మాట్లాడుతూ పాఠశాలల హేతుబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఏ గ్రామంలోనూ పాఠశాలలు మూతపడకుండా రేషనలైజేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వసతిగృహాలకు మరమ్మతులు చేసేందుకు రూ.20 కోట్లు మంజూరు చేశామని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అద్దె భవనాల్లో సౌకర్యాలు లేకపోతే వాటిని మార్చే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గత వైసీపీప్రభుత్వ హయాంలో భవన నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు విషయంలో అనుసరించిన విధానాల వల్ల కొత్త భవనాల నిర్మాణాలకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పలు అంశాలను ప్రస్తావించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌తో జడ్పీ సీఈవో, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి, పక్కన మంత్రి స్వామి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, జేసీ గోపాలకృష్ణ, సీఈవో చిరంజీవి

నాడు-నేడు పనుల అక్రమాలపై విచారణ చేయాలి



గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పనుల్లో అనేక అక్రమాలు జరిగాయి. వాటిపై సమగ్ర విచారణ చేయాలి. పాఠశాలల కమిటీలు, హెచ్‌ఎంలతో ఆ పనులు చేయించడం వల్ల అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. దీనిపై విచారణ చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. అలాగే పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. వెంటనే విద్యార్థులకు నీరు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలి. జాతీయ రహదారి నిర్మాణం వల్ల మునిసిపల్ పైపులైను దెబ్బతింటున్నది. అందువల్ల పరిహారం చెల్లించే విధంగా అధికారులు కృషి చేయాలి.

\- డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే

రోడ్ల మరమ్మతుల్లో నాణ్యత డొల్ల



రోడ్ల మరమ్మతు పనులు ఇంతవరకు పూర్తి కాలేదు. పని చేసిన చోట నాణ్యతలేక అప్పుడే రాళ్లు లేచాయి. ఈ పనులు ఎప్పటి లోపు పూర్తిచేస్తారు. కిమ్స్ ఆసుపత్రి నుంచి ఒంగోలు నగరంలోకి వచ్చే రోడ్డు మరీ అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు పనులను ఎవరు చేస్తారని ప్రశ్నించారు. సమావేశానికి జాతీయ రహదారుల అధికారులు రాలేదు. ఆ రోడ్డులో అధికారులు కూడా తిరుగుతుంటారు. అంత అధ్వాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

\- దామచర్ల జనార్దన్, ఒంగోలు శాసనసభ్యుడు

ఏది అడిగినా సమాధానం రావడం లేదు



సమావేశంలో ఏ అంశాన్ని ప్రస్తావించినా కనీస సమాధానం రావడం లేదు. గత ఐదేళ్ల కాలంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు కూడా అధికారులు ఏ అంశాన్ని ప్రస్తావించినా సమాధానం ఇవ్వని పరిస్థితి ఏర్పడింది.

\- ఎంఎం కొండయ్య, చీరాల ఎమ్మెల్యే

అల్లినగరంలో బీసీ హాస్టల్‌ను మార్చాలి



కొమరోలు మండలం అల్లీనగరంలోని బీసీ హాస్టల్ కూలిపోయే దశలో ఉంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి మార్చే అవకాశాన్ని పరిశీలించాలి. మరో వైపు గిద్దలూరులో కూడా వసతిగృహాల పరిస్థితి దారుణంగా ఉంది. అద్దెభవనంలో ఉన్న వసతిగృహంలో ఒక టాయిలెట్ మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

\- ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యుడు

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలి



తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలి. తద్వారా పాఠశాలల బలోపేతానికి దోహదపడుతుంది. ఆదిశగా జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం చేయాల్సిన అవసరం ఉంది. సంతనూతలపాడులో వసతిగృహం కొత్తది నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- బీఎన్ విజయకుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే

పొదిలి-మర్రిపూడి రోడ్డుకు మరమ్మతులు చేయాలి



పొదిలి- మర్రిపూడి రోడ్డు అధ్వానంగా ఉంది. దీని వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో పట్టించుకున్న పరిస్థితి లేదు, ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమైనందున రాకపోకలు అధికంగా ఉన్నాయి. వెంటనే రోడ్డు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. కొండపి నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సమావేశం దృష్టికి తెచ్చారు. మండలాల వారీగా పాడైపోయిన కరెంట్ పోల్స్‌కు నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

\- దామచర్ల సత్య, మారిటైం బోర్డు చైర్మన్

పాఠశాలల భవనాలను పూర్తి చేయాలి



పాఠశాలల భవనాలు 90శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పదిశాతం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా త్వరగా చర్యలు తీసుకోవాలి. వాటినిపూర్తిచేయడం వల్ల విద్యార్థులకు వసతులు ఏర్పడుతాయి.

\- బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి శాసనసభ్యుడు

రేషనలైజేషన్‌లో పాఠశాలలు మూతపడకుండా చూడాలి



రేషనలైజేషన్‌లో పాఠశాలలు మూతపడకుండా విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఇంకో వైపు పాఠశాలల్లో ల్యాబ్‌లు వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- చంద్రశేఖర్‌రెడ్డి, శాసన మండలి సభ్యుడు

విద్యాశాఖ అధికారి పట్టించుకోవడం లేదు



మంచి నీటి సమస్యతో ఉపాధ్యాయులు పాఠశాలలకు రావడం లేదు. దీనిపై స్వయంగా నేను విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినా ఇంత వరకు స్పందించిన పరిస్థితి లేదు. ఫలితంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- చంద్రశేఖర్, యర్రగొండపాలెం ఎమ్మెల్యే

రూ.10వేల కోట్లు రాబట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రూ.10వేల కోట్లు నిధులు రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఒంగోలులో ఆదివారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామితో పాటు అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

ఘనంగా ముగిసిన క్విస్ ఫెస్ట్

ఈవెంట్స్‌లో పాల్గొన్న వందలాది మంది విద్యార్థులు
ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న సూర్యకల్యాణ్‌చక్రవర్తి తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల నుంచి జరుగుతున్న క్విస్ ఫెస్ట్-2025 ఆదివారం ఘనంగా ముగిసింది. సస్టైనబులిటి కాన్సెప్ట్‌తో రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్‌తో ఈ ఏడాది క్విస్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలకు దేశంనలుమూలల నుంచి 3 వేల మంది విద్యార్థులు హాజరైనట్లు క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రీలు తెలిపారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎన్ఐటీ రాయ్‌పూర్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ క్విస్ కళాశాలలో జరుగుతున్న ప్రాజెక్టులు, టీచింగ్ విధానం అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రతివిషయానికి కుంగిపోకుండా, చక్కటి ఆలోచనలతో తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వికసిత భారతాన్ని నిర్మించాలనే ప్రధాని లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తూ ఈ థీమ్స్ తీసుకవచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, కన్వీనర్ సమీర్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్పోర్ట్స్‌లో సైతం అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్విస్ ఫెస్ట్‌లో ఈ ఏడాది జాయ్‌రైడ్స్ మ్యూజిక్ కాన్సర్ట్ తదితర అంశాలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

మత్తు పదార్థాలు వద్దు.. బంగారు భవిష్యత్ ముద్దు..!

రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉత్సాహంగా 5 కే రన్
హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే దామచర్ల, బీఎన్

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, మత్తు పదార్థాలు వదిలి, బంగారు భవిష్యత్ వైపు అడుగులు వేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన, మాదకద్రవ్యాల నివారణపై రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాల, టెక్‌బుల్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మారథాన్ 5కే రన్ ఆదివారం ఒంగోలులో ఉత్సాహంగా సాగింది. స్థానిక మినీ స్టేడియం వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహనతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ర్యాలీ ఏర్పాటు చేసిన నిర్వాహకులను, రన్‌లో పాల్గొన్న యువతను కలెక్టర్ అభినందించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ క్షణకాల సంతోషం కోసం డ్రగ్స్, గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు బానిసలై నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారుల ప్రాణాలకు హెల్మెట్ రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవితం వైపు యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత ఒత్తిడికి లోనవుతుందని, దీనిని అధిగమించేందుకు సరైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులుగా రైజ్ విద్యా సంస్థల కోశాధికారి శిద్దా భరత్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, టెక్ బుల్స్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు అధిక సంఖ్యలో యువతీ, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

62 ఏళ్ల వయస్సులో పరుగుల 'విజయ'ం

5కే రన్‌లో గుంటూరుకు చెందిన 62 ఏళ్ల మహిళ ఉత్సాహంగా పరుగెత్తి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిరుపేద మహిళ క్రీడల్లో రాణిస్తూ కుటుంబానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా, యువతతో పోటీపడుతూ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తూ అందరినీ ఔరా అనిపించారు. అనాథగా ఉండగా.. ఆదరించిన చంద్రం అనే వ్యక్తే ఆమెను వివాహం చేసుకోగా, ఇద్దరు పిల్లలు పుట్టాక అనారోగ్యం బారిన పడ్డారు. కుటుంబ పోషణ కోసం అల్పాహారం, ఇడ్లీలు, దోశలు అమ్ముకోవడంతో పాటు ఇళ్లలో పనులు చేస్తున్నారు. అయినప్పటికీ క్రీడలపై ఆమెకున్న ఆసక్తిని వీడలేదు. ఆదివారం ఒంగోలు వచ్చిన విజయ అందరితో పోటీపడి పరుగెత్తి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు.



విజేతలతో కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే జనార్దన్

అవీ..ఇవీ

మహిళ మెడలో గొలుసు చోరీ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్న మహిళ మెడలో గొలుసును లాక్కొన్ని చైన్‌స్నాచర్లు ఉడాయించిన ఘటన పట్టణ శివారులోని ఎన్‌టీఆర్ కాలనీ వద్ద చోటుచేసుకొంది. పట్టణానికి చెందిన తలారి లక్ష్మీనారాయణమ్మ కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నది. ఆదివారం సాయంత్రం ఒక వ్యక్తి కూల్‌డ్రింక్స్ కావాలని అడిగాడు. బిల్లు ఎంత అని ఆ మహిళను అడిగాడు. బిల్లు లెక్కిస్తున్న సమయంలో లక్ష్మీనారాయణమ్మ గొంతును గట్టిగా పట్టుకొని మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసును లాక్కున్నాడు. సమీపంలోనే మోటార్‌సైకిల్‌ను అప్పటికే స్టార్ట్ చేసి ఉన్న మరివ్యక్తి వాహనంపై ఎక్కి పరారయ్యాడు. లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రద్దు చేసిన బస్సును పునరుద్ధరించాలి

కంభం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గతంలో మార్కాపురం-పాపినేనిపల్లి నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని అర్ధవీడు మండల ప్రజలు మార్కాపురం ఆర్టీసి డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. పాపినేనిపల్లి గ్రామానికి చెందిన కట్టా రంగస్వామి, ఖాశింబాషా, రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం వరకు మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు మార్కాపురం నుంచి పాపినేనిపల్లెకు 2 సర్వీసులు తిరిగేవన్నారు. అయితే కరోనా సమయంలో పగలు సర్వీసు రద్దుచేశారన్నారు. కొన్ని రోజులకు నైట్‌హాల్ట్ బస్సును కూడా రద్దు చేయడంతో అర్ధవీడు మండలం లోని వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నైట్‌హాల్ట్ సర్వీసు మార్కాపురం 7.30 గంటలకు బయలుదేరి రాత్రికి పాపినేనిపల్లెకు చేరుకొనేదన్నారు. తిరిగి ఉదయం 5గంటలకు పాపినేనిపల్లె నుంచి బయలుదేరి మార్కాపురం వెళ్లేదన్నారు. ఈ బస్సు వలన ఆర్టీసీకి ఆదాయం బాగానే వచ్చేదన్నారు. ఆర్టీసీ ఉన్నతాదికారులు స్పందించి రద్దు చేసిన నైట్‌హాల్ట్ బస్సును తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

వెలగని వీధిలైట్లు

గిద్దలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజానగర్ సమీపంలోని జగనన్నకాలనీలో కొన్ని వీధుల్లో వీధిలైట్లు సక్రమంగా వెలుగడం లేదు. కాలనీ వెనుకవైపు అంతా కొండ ప్రాంతం కావడంతో చిమ్మచీకటిలో విషపురుగులు ఎక్కడ వస్తాయోనని ఆప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని నెలరోజులకు పైగా వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మృతి



సరళ సుశీల (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌కు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సరళసుశీల ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యా యురాలిగా ఆమె పనిచేశారు. హైదరాబాద్ లో చికిత్స పొందుతూ మృతిచెందిన ఆమె అంత్యక్రియలు సోమవారం ఏబీఎం కాంపౌండ్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

న్యాషాభక్తరాజు సేవలు ఆదర్శనీయం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): న్యాషాభక్తరాజు సేవలు ఆదర్శనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఉప్పుగుండూరు మాజీ సర్పంచ్ 41వ వర్ధంతిని స్థానిక భక్తయ్య విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన న్యాషాభక్తరాజు 31 ఏళ్ల గ్రామసర్పంచ్‌గా, 30 ఏళ్ల కోపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా పనిచేసి గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కమ్యూనిస్ట్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి పేద ప్రజలకు అండగా నిలిచారని ఆయన సేవలు కొనియాడారు. యువతను అభ్యుదయ మార్గంలో నడిపించేందుకు బాల, యువజన సంఘాలను స్థాపించి గ్రామగ్రామాన కళారూపాలతో ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు టీడీపీ నాయకుడు కాట్రగడ్డ చంద్రబాబు, ఎంపీటీసీ సభ్యుడు మున్నంగి వెంకట్రావు, ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాద్, తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, దీవి శ్రీధర్‌బాబు, భక్తయ్య కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో రతన్ టాటా మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. స్థానిక హైదరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోటీల ముఖ్యఅతిథిగా హాజరైన దామచర్ల ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. పోటీల ద్వారా మానసిక ఉల్లాసం, పోటీతత్వం అలవడతాయని ఆయన చెప్పారు. కాగా మొదటి రోజు జరిగిన పోటీలకు సుమారు 128 క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, హైదరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్‌రెడ్డి, వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు కందుల కోటి, జేకే.రాజు, శ్రీకాంత్, పూసాపాటి బుజ్జి పాల్గొన్నారు.

నాయుడుపల్లె కాలనీలో మంచినీటికి కటకట

- ప్రైవేటు వాహనాల్లో దూరప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న ప్రజలు
- బోర్లకు మరమ్మతు చేయాలని డిమాండ్

తర్లుపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని నాయుడుపల్లికాలనీ రైల్వేగేట్ వద్దనున్న బీసీ కాలనీ వాసులు వారం రోజులుగా మంచినీటికి కటకటలాడుతున్నారు. ఈ కాలనీలకు నీటి సరఫరా చేసే బోరు మర మ్మతులకు గురికావడంతో మంచినీటి ఎద్దడి ఏర్పడింది. బోరుకు మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు బోరు బాగుచేయించాలని విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో వీరికి నీటి కష్టాలు తప్పడం లేదు. విధిలేని పరిస్థితుల్లో తర్లుపాడు బస్టాండ్ కూడలిలోని చిన్న ట్యాంకు నుంచి తోపుడు బండ్ల ద్వారా బైకులు, సైకిళ్ల, ఆటోలలో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ కాలనీవాసులు రెక్కా ఆడితే డొక్కా ఆడని పరిస్థితి. నీటి ఎద్దడి ఏర్పడంతో ఇంటిలోని ఒకరు కూలి పనులు మానుకొని నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు బోర్లు మరమ్మతులకు గురైనప్పుడు కూడా రోడ్డెక్కి ధర్నా చేయాల్సి వచ్చిందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు లేనిపక్షంలో కాలనీ సమస్యను అధికారులు పట్టించుకోరని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీప్ బోరుకు మరమ్మతులు చేయించి నీటిఎద్దడి తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.





తోపుడు బండ్లపై, మోటారు సైకిల్‌మీద నీళ్లు తెచ్చుకుంటున్న కాలనీ వాసులు



ఆటోలో నీరు తెచ్చుకుంటున్న కాలనీ వాసులు

ఊరి సర్వే నంబరు తాకట్టు పై విచారణ

పుల్లలచెరువు,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : గ్రామకంఠం భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌పై ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిరంజీవి విచారించారు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన చిరంజీవి ఆదివారం సైతం విచారించారు. వైసీపీ నాయకుడు చేయించిన అక్రమ ఆన్‌లైన్‌పై విచారించారు. మండలంలోని ఇసుక త్రిపురవరం గ్రామ రెవెన్యూలోని సర్వే నెం.296లో య.8.36సెంట్ల భూమి వుంది. ఆ సర్వే నెంబరులో సిద్దెనపాలెం గ్రామం వుంది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గడ్డం సుబ్బయ్య 4.32 ఎకరాలను అదేగ్రామానికి చెందిన మరోక వ్యక్తి కోళ్లి వీరబ్రహ్మయ్య 4.00 ఎకరాల భూమిని అక్రమంగా 2020లో ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈ విషయంపై కొందరు ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకుడిని అరెస్టు చేశారు. రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు గ్రామంలో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నాతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.



సిద్దెనపాలెంలో విచారిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మూడేళ్లగా అద్దెభవనంలోనే వసతిగృహం

- నాడు పట్టించుకోని వైసీపీ సర్కారు
- నేడు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గిద్దలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం బటన్ నొక్కుడు కార్యక్రమానికి ఇచ్చిన ప్రాధాన్యత అభివృద్ధి కార్యక్రమాలకు ఇవ్వలేదు. ఇందుకు పట్టణంలోని బీసీ బాలుర హాస్టలే ఉదాహరణ. పట్టణంలోని కొంగళవీడు రోడ్డులో సొంతభవనంలో బీసీ బాలుర వసతి గృహం నడుస్తోంది. కాలక్రమేణ బిల్డింగ్ శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో వైసీపీ హయాంలో మూడేళ్ల క్రితం తాత్కాలికంగా ఎస్‌వీ కాలనీలోని ఓ అద్దెభవనంలోకి మార్చారు. మూడేళ్లు గడిచినా, భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో సుమారు 70 మంది విద్యార్థులు మూడేళ్లగా అద్దె భవనానికే పరిమితమయ్యారు. విద్యాభివృద్ధికి అది చేశాం, ఇది చేశాం అంటూ గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం కనీసం నాడు-నేడు కార్యక్రమంలోనైనా నూతన హాస్టల్ భవనానికి నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వమైనా శిథిలా వస్థకు చేరిన పాత భవనాన్ని పడగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలని హాస్టల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరి మూతపడిన హాస్టల్ గదుల్లో రాత్రివేళల్లో అసాంఘీక కార్యకలా పాలు జరుగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల కోసం నూతన భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న వసతిగృహ భవనం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- తండ్రి అలనాపాలనకు దూరమైన ఇద్దరు చిన్నారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో చోటుచేసుకొంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు, గ్రామానికి చెందిన గోపిదేశి వెంకట్రావు చెక్కపని చేసుకుంటూ జీవనం వెళ్లదీసున్నాడు. వెంకట్రావు శనివారం పుల్లలచెరువు మండలం అక్కపాలెం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో వెంకట్రావు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను ఎర్రగొండ పాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకట్రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న వయస్సు లోనే తండ్రి మృతిచెందడంతో చిన్నారులు బిక్కు బిక్కుమంటున్నారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండ పాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే టీడీపీ ప్రధాన కార్యదర్శి బోడ చెన్నవీరయ్య, వై.పాలెం పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్) నాయకులు నలగాటి ఆత్మా మేకల శ్రీను, వెంకట నారాయణ, వలి, రంజిత్ తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య కుటుంబ సభ్యులు, గోపిదేశి వెంకట్రావు (ఫైల్)



తండ్రి మృతితో మౌనంగా రోదిస్తున్న చిన్నారులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

పొదిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు బీవీ.రమణారెడ్డి, డాక్టర్ వి నీరజ, డాక్టర్ రామలింగేశ్వరరావు, డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ బ్రహ్మారెడ్డిలతో కూడిన వైద్యబృందం రోగులను పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో 190 మంది రోగులకు వైద్య సేవలందించార అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. వైద్య శిబిరాన్ని మానవతా సేవా సంస్థ డైరెక్టర్ కాటూరి వెంకటనారాయణబాబు, శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన రాజన్న చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు బీరం రాజ మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయించారు. మానవతా సేవాసంస్థ ద్వారా సమాజానికి సేవలందించాలనే ప్రధాన లక్ష్యంతో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థ పొదిలి ఛైర్మెన్ ముప్వల పార్థ సారధి, జిల్లా కన్వీనర్ కె యలమందారెడ్డిలు తెలిపారు.



రోగులను పరిక్షిస్తున్న వైద్యురాలు

ఘనంగా అభయ ఆంజనేయ స్వామి

ఆలయ వార్షికోత్సవం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి). స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో గుండ్లకమ్మ వంతెన వద్ద వెలసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఏకాదశ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు పంచామృతాభిషేకం, ఆకుపూజ, గోపూజ, మహా మంగళహారతి కార్యక్రమాలను అర్చకులు సుబ్బయ్యశాస్త్రి, రాములు శాస్త్రోతంగా వేదమంత్రోచ్ఛరణతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం ప్రదర్శనతో భక్తులను అలరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అభయ ఆంజనేయస్వామి గ్రామోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



విశేష అలంకరణలో పోలేరమ్మ

నేడు నులిపురుగుల మాత్రల పంపిణీ

కొమరోలు, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరోలు, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రల్లోని విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు(ఆల్‌బెండోజోల్)లను సోమవారం అందివ్వనున్నట్లు వైద్యులు చైతన్యదీపక్, రజియాభానులు తెలిపారు. కావున మండలంలోని 6నెలల నుంచి 19సంత్సరాల వయసు కలిగిన పిల్లలు తప్పనిసరిగా ఈ మాత్రలను ఉచితంగా అన్ని కేంద్రల్లో ఆల్‌బెండోజోల్- 400 తీసుకోవాలన్నారు.

ఏనుగుల పులయ్యకు ఘన నివాళి



పుల్లయ్య విగ్రహనికి నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు ఏనుగుల పులయ్య 16వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని హెడ్ పోస్టాఫీసు వద్ద గల పుల్లయ్య విగ్రహానికి వామపక్షా ప్రజాసంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోసం కడవరకు పోరాడిన మహానాయకుడు ఏనుగుల పుల్లయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, నాయకులు బాలనాగయ్య, రూబెన్, రాజు, ఏనుగుల సురేశ్, నన్నేసా, కాశయ్య, యూటీఎఫ్ నాయకులు వొద్దుల వీరారెడ్డి, బి.శ్రీరాములు, పి.వెంకటేశ్వర్లు, గౌతమ్ బాబు, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

12న ఉచిత వైద్య, రక్తదాన శిబిరం

- విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ -1104 ఆధ్వర్యంలో ఈ నెల 12న ఒంగోలులోని యూనియన్ కార్యాలయ అవరణలో ప్రాంతీయ శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ సంజీవరావు, సీహెచ్ హరికృష్ణ అధ్వర్యంలో ఉచితవైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మార్కాపురం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కే.మల్లికార్జునరావు, సీహెచ్ రవికాంత్‌లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకొని 76వ వసంతంలోకి అడుగులు పెడుతున్న నేపథ్యంలో ప్లాటినం జూబ్లిఉత్సవాల సందర్భంగా వైద్య, రక్తదాన శిభిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని యూనియన్ నాయకులు, మార్కాపురం డివిజన్ నాయకులు, విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అబాకస్‌లో జీఎంఆర్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ పాఠశాల విద్యార్థులు అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పీవీ.అర్జున్, బి.అభినాగ్, లోకేశ్‌లు ప్రతిభ కనబర్చారని అర్జున్‌కు రైజింగ్ స్టార్ అవార్డు, జ్ఞాపిక ఇచ్చారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

చలో ఢిల్లీకి ఎల్ఐసీ ఏజెంట్లు



ఢిల్లీకి బయల్దేరి వెళ్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 9(ఒంగోలురూరల్): ఎల్ఐసీలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు ఆదివారం చలో ఢిల్లీ కార్యక్రమానికి ఒంగోలు నుంచి రైలులో తరలివెళ్లారు. ఎల్ఐసీఏవోఐ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో ఈనెల 11వ తేదీన ఏజెంట్లు ధర్నా చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజశేఖర్, బెజవాడ శివయ్య, బి.వెంకట్రావు, టి.మహేష్, ఎం.తిరుపతినాయుడు, ఎస్‌వీ.సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, శివరామకృష్ణ పి.మహేష్, తిరుపతయ్య, మాలకొండయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

టి.నాయుడుపాలెం (టంగుటూరు) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. 41 మంది బాధితులకు రూ.43 లక్షల విలువైన చెక్కులను, రూ.8 లక్షలు విలువైన ఎల్‌వోసీ అందజేశారు. జగన్‌ను కుటుంబ సభ్యులు, సొంతపార్టీ నేతలే నమ్మడం లేదని, అందుకే నేతలంతా ఒకరొకరుగా ఆ పార్టీ వీడుతున్నారని ఆయన అన్నారు.

ముఖాముఖి

వినియోగదారులకు మెరుగైన సేవలు

టి.చినలంకబాబు, ఏఈ, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో వినియోగదారులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జవాబు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. నిరంతరం అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

ప్ర: రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌లను అందించటంలో జాప్యం చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి?

జ: అలాంటిదేమి లేదు. వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే విచారించి మంజూరు చేసిన తరువాత ప్రాధాన్యతాక్రమంలో అందజేస్తున్నాం. గృహ వినియోగదారులకైతే నెలరోజుల లోపే అందజేస్తున్నాం.

ప్ర: లోవోల్టేజీ సమస్య ఉందా?

జ: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి మారెళ్ళ - 2, తూర్పుకంభంపాడులో ఒకటి, శంకరాపురంలో ఒకటి ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరుచేశాం. తద్వార లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తున్నాం. ఇంకా ఏదైనా గ్రామంలో లోవోల్టేజీ సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చినట్లయితే వెంటనే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

ప్ర: మండలంలో విద్యుత్ బకాయిలు ఎంత మేరకు ఉన్నాయి?

జ: మండలంలో గృహ వినియోగదారులతోపాటు వ్యవసాయ వినియోగదారుల కనెక్షన్‌లకు సంబంధించి రూ.2.38 లక్షల బకాయిలు ఉన్నాయి. వాటిని వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వసూలు చేస్తాం.

ప్ర: మండలంలో సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారా?

జ: తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేసుకొనేందుకు వినియోగదారులకు అవగాహన కల్పించాం. ఒక్కో వాల్ట్‌కు రూ.30వేలు సబ్సిడీ ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేశాం.

అర్థంతరంగా ఆగిన నిర్మాణాలు

- 'నాడు-నేడు' తెచ్చిన తంటా
- మౌలిక వసతులు లేక ఇక్కట్లు
- గత వైసీపీ పాలకుల అసమర్థతతో విద్యార్థులకు తప్పనిపాట్లు



దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యలో నిలిచిపోయిన తరగతి గదుల భవనం

దర్శి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు గత వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన నాడు-నేడు పథకం అభాసుపాలైంది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో తరగతి గదుల భవనాలు, ఇతర నిర్మాణాలు గత రెండేళ్లుగా నిలిచిపోయాయి. విద్యా సంవత్సరం మధ్యలో ప్రారంభించిన తరగతి గదుల భవనాలు మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంవతో ఇప్పుడైనా నిలిచిపోయిన పనులను పూర్తి చేస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు. దర్శి మండలంలో నాడు-నేడు పథకం రెండో దశలో 37 పాఠశాలల్లో 160 పనులు కేటాయించారు. ఆ పనుల నిర్మాణం కోసం రూ.19.72 కోట్లు మంజూరు చేశారు. ఆర్భాటంగా 124 పనులు ప్రారంభించారు. ప్రారంభించిన పనుల్లో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఇంకా 40 పనులు ప్రారంభానికి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం కాగితాల మీదే నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన తర్వాత నిధులు విడుదల చేయకుండా వదిలేసింది. దీంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారు. గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకం పేరును మన బడి, మన భవిష్యత్తుగా మార్చింది. నారా లోకేష్ విద్యాశాఖ నిర్వహిస్తుండటంతో మధ్యలో నిలిచిపోయిన పనులు పునఃప్రారంభమవుతాయన్న ఆశతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. వచ్చే బడ్జెట్‌లోనైనా ఈపనులకు నిధులు కేటాయించి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పూరిమెట్ల పాఠశాలలో వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు కరువయ్యాయి. చాలీచాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాహకంతో ఇటువంటి దుస్థితి నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలానికి సుదూర ప్రాంతంలో ఉన్న పూరిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గతంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్నది. మొత్తం 352 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎనిమిది గదులు మాత్రమే ఉన్నాయి. రెండు పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉండటంతో చాలీచాలని గదులతో అవస్థలు పడుతున్నారు. చెట్ల కింద, పాఠశాల వరండాలో చదువులు సాగిస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నా గదుల కొరత వేధిస్తుంది. ఇటీవల గ్రామ యువత ముందుకు వచ్చి రెండు రేకుల షెడ్లను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వాటిల్లో కూడా తరగతులు జరుగుతున్నాయి.

గదుల కొరత తీవ్రంగా ఉంది

- ఏ.ప్రమోద్ కుమార్, హెచ్‌ఎం



పూరిమెట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎనిమిది రూంలు మాత్రమే ఉన్నాయి. దీంతో చేసేదేమి లేక చెట్ల కింద, వరండాలో గ్రిల్స్ ఏర్పాటుచేసి విద్యాబోధన చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పాఠశాలకు స్థలం ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు చదువు సులువుగా చెప్పవచ్చు.

నారాయణస్వామి దేవస్థాన అభివృద్ధికి చర్యలు

- అంచనాలు తయారుచేస్తున్న అధికారులు
- ఈవో నరసింహబాబు



ఆలయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దేవదాయ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసులు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. ఆదివారం దేవదాయ, గుంటూరు జోన్ ఇంజనీర్ విభాగానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు దేవస్థానాన్ని సందర్శించారు. ఈసందర్భంగా దాతల సహకారంతో చేపట్టనున్న మహాప్రాకార మండపం నిర్మాణం, జాతీయ రహదారి నుంచి దేవస్థానానికి వచ్చే దారిలో ఆర్చి నిర్మాణం, అన్నదాన బిల్డింగ్, రేకుల షెడ్డులు, భక్తుల అవసరాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి అంచనాల తయారుచేయడానికి కొలతలను తీసుకొన్నారు. త్వరలో మహాప్రాకార మండపాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చినఆదినారాయణ, వెంకట్రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, పామూరులోని శ్రీమదన వేణుగోపాల స్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో నూతన నిర్మాణాలకు ఇంజనీరింగ్ అధికారులు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. కల్యాణ మండపం, వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం, వరదరాజ స్వామి ఆలయ మండపం, కోనేరు పునః ప్రారంభం, యాగశాల నిర్మాణం చేపట్టబోతున్నట్లు ఈవో నరసింహబాబు తెలిపారు.

దేవస్థానంలో పూజలు

మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారికి మహానైవేద్యాన్ని మేళతాళాలతో రాజగోపురం వద్ద నుంచి ఆలయ ప్రదక్షిణలు చేస్తూ స్వామి వారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమాలతో పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కురిచేడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. నులిపురుగులు కడుపులో ఉంటే రక్త హీనత కలుగుతుందన్నారు. సంవత్సరంలో రెండుసార్లు అలబెండజోల్ మాత్రలు స్వీకరిస్తే నులిపురుగులు నివారణ జరుగుతుందన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న తేరేజమ్మ

తాళ్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాల అభ్యున్నతి కోసం ఏర్పాటుచేసిన వసతి గృహాల్లోని విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదవాలని బీసీ బాలికల వసతిగృహం మ్యాట్రిన్ తేరేజమ్మ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన బీసీ బాలికల వసతి గృహవార్షికోత్సవం, తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలను వమ్ముచేయకుండా ఉన్నత స్థాయికి చేరుకొని మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. వసతి గృహాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. పదో తరగతి బాలికలు కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి వసతి గృహానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిదిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వాసు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ టీడీపీ మండల నాయకులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడే మాగుంట కుటుంబ సభ్యులకు గంగమ్మతల్లి కరుణ కటాక్షాలు కలిగిఉండాలని కోరుకున్నట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, తదితరులు తెలిపారు. అలాగే, లింగాలపాడు యెరూషలేము ప్రార్థనా మందిరంలో ఎంపీ మాగుంట ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని పాస్టర్ వరమ్మ, ప్రమీల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పోలేరమ్మకు..



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు దేవాలయాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. తమ పిల్లా పాపలను చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. ముండ్లమూరు, బొప్పూడివారిపాలెం, నూజెండ్లపల్లి, శంకరాపురం, పోలవరం, పసుపుగల్లు, ఈదర గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.

ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని అభినందించిన మంత్రి గొట్టిపాటి



ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని అభినందిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో గతనెల 13 నుంచి 20 వరకు జరిగిన ఖోఖో పోటీల్లో జాతీయ జట్టుకు ప్రపంచ్‌కప్ రావడంలో మండలంలోని ఈదర గ్రామానికి చెందిన క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డి ప్రధాన పాత్ర వహించడం గర్వకారణమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈసందర్భంగా శివారెడ్డిని వారు అభినందించారు. తన ప్రతిభాపాటవాలతో దేశానికి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో మంత్రి రవికుమార్‌ను, నరసరావుపేటలో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను శివారెడ్డి కలిశారు. ఈసందర్భంగా శివారెడ్డిని వారు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కొండారు రాముడు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు తాండవ రంగారావు

దొనకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దొనకొండ పారిశ్రామిక కేంద్రానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పరిశ్రమలకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొనకొండ ప్రాంతం ఎంతో వెనుకబడిన ప్రాంతమని అన్నారు. ఇక్కడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం దొనకొండలో పరిశ్రమల ఏర్పాటును పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

ప్రస్తుతం సీఎంగా ఉన్న చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీల అమలుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి దొనకొండ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిరుపల్లి అం జయ్య మాట్లాడుతూ దొనకొండలో కారిడార్ ఏర్పాటు, వెలుగొండ ప్రాజెక్టు అమలుకోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారాలు, ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. సమావేశంలో నాయకులు కుందుర్తి చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, మేళం ఉదయ్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న సీఐ రామారావు

దర్శి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సీఐ వై.రామారావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాల న్నారు. ప్రతి పౌరుడు ఉన్నత విద్యావంతుడైతేనే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ ప్రతినిధి కె.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ యేసు రత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన పొగమంచు



దర్శి - అద్దంకి రహదారిలో పొగమంచు

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలురహదారులను ఆదివారం పొగమంచు కమ్మేసింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్ళే వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఐదు నుంచి పది గంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. దీంతో రహదారి కనిపించక వాహనాలు రోడ్డు పక్కన నిలిపివేశారు. దర్శి - అద్దంకి రహదారి, వేంపాడు - ఈదర రహదారి, ఉల్లగల్లు - వేముల రహదారి, నూజెండ్లపల్లి - మారెళ్ళ రహదారులు పూర్తిగా మంచుతో కమ్మేశాయి. కొంతమంది వాహన చోదకులు లైట్ల సాయంతో అతికష్టం మీద ప్రయాణం సాగించారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



వృద్ధ క్రీడాకారుడిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో జరిగిన లాన్‌టెన్నిస్ పోటీల్లో వృద్ధ క్రీడాకారుడు అత్యుత్తమ ప్రతిభ చూపి విజయం కైవసం చేసుకున్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో గత రెండు రోజులుగా పీవీ రమణారెడ్డి జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ ఇన్విటేషన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ పోటీ ల్లో ఒంగోలుకు చెందిన 87 ఏళ్ళ వృద్ధుడు చిరంజీవి పాల్గొని విజయం సాధించారు.

ఈసందర్భంగా ఆ యనను కాస్మోపాలిటన్ క్లబ్ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్, పులి రాధాకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా లా న్‌టెన్నిస్ అధ్యక్షులు జీఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి అల్లూరి సత్యనా రాయణ, దేవకి వెంకటేశ్వర్లు, సీఐ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులు



అవార్డులు అందుకున్న విద్యార్థులు

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అబ్యాకస్ పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన బోధిధర్మ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి అవార్డు సాధించారు. విశ్వ ఎడ్యుటెక్ 2024-25 విద్యాసంవత్సరానికి అమరావతిలో రాష్ట్రస్థాయి అబ్యాకస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. అబ్యాకస్ ట్రైనీ శిరీష ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్న 4వ తరగతికి చెందిన జె.రేవంత్‌కుమార్ జూనియర్ లెవల్‌లో, 5వ తరగతికి చెందిన కె.సిసింద్రీనాథ్ సీనియర్ లెవల్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ జి.రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.





మధ్యాహ్న భోజనంలో.. మార్పులు

- సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం
- బడికి వచ్చిన వారందరూ తినేలా ప్రణాళిక
- పథకం ప్రక్షాళనకు విద్యా మంత్రి లోకేశ్ ఆమోదం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యంతో అన్నం.. రుచికరమైన కూరలతో.. పాఠశాలలకు హాజరైన వారందరూ తప్పనిసరిగా భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో మార్పులు తీసు కొచ్చారు. ఆయా మార్పులకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నభోజన పథకంపై గురువారం జరిగిన సమీక్షలో మంత్రిలోకేశ్ విద్యాశాఖ ప్రతిపాదనలకు మరికొన్ని మార్పులు సూచించారు. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ఆయా మార్పులు చోటు చేసుకోనున్నాయి. పథకం కోసం సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా అంగీకారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలుత కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ తల్లిదండ్రుల కమిటీలు, ఏజన్సీ నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలు 4700 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు దాదాపు 6.45 లక్షల మంది ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. లావు బియ్యంతో వండిన అన్నాన్ని తినేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదని ఉపాధ్యాయులు గుర్తించారు. దీని గురించి అనేకసార్లు నిర్వాహకులు, ఉపాధ్యాయులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ కూడా నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించినా పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభు త్వం అధికారం చేపట్టిన వెంటనే మధ్యాహ్న భోజనం పథకంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనంలో మార్పులకు సిద్ధమైంది. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్య కు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించ డానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏజెన్సీలకు జనవరి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

మార్పులు ఇలా..

- మధ్యాహ్న భోజన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ పెంచాలి. భోజనం కోసం సన్న బియ్యం ఇవ్వాలి.
- విద్యార్థులకు రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్. ఉదయం ఇచ్చే రాగి జావకు ప్రత్యామ్నాయంగా రాగులతో చేసిన చిక్కీలు, లడ్డూలు లేదా పాలు ఇవ్వాలి.
- మెనూలో ఒకరోజు ఇచ్చే పొంగలి మార్చాలి.
- వైట్‌రైస్, సాంబారు విడివిడిగా ఇవ్వాలి.
- ఉడకబెట్టిన కోడిగుడ్లు పెంకు తీయకుండా ఇవ్వాలి.
- ప్రతి శనివారం ఇచ్చే స్వీట్‌కు ప్రత్యామ్నాయం.



కూలీల కొరత

- తల్లడిల్లుతోన్న బర్లీ పొగాకు సాగుదారులు
- ఆశాజనకంగా లేని అమ్మకాలు, ఆందోళనలో రైతులు
- రాలిన ఆకు, గుల్ల ఆకు తేవద్దంటున్న వ్యాపారులు

పంగులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులు కూలీల కొరతతో తల్లడిల్లుతున్నారు. పెరిగిన సాగు విస్తీర్ణంతో రైతులు అదునుకు ఆకు వొలిచే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన సాగు ఖర్చులు, మార్కెట్లో నల్ల బర్లీ కొనుగోళ్ల ప్రారంభంకాక పోవడం, రాలిన ఆకు, గుల్లాకు కొనేందుకు ఆసక్తి చూపని వ్యాపారుల చర్యలతో రైతులు వేదనకు గురవుతున్నారు. గత ఏడాది ఆకు నాణ్యత చూడకుండా అధిక రేటుకు వ్యాపారులు ఇళ్లకు వచ్చి పొగాకు కొనుగోలు చేయడంతో ఆశించిన దానికన్నా లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో బర్లీ సాగు చేపట్టారు. గత ఏడాది వందల ఎకరాలకే పరిమితమైన సాగు ఈ ఏడాది వేల ఎకరాలకు చేరింది. తొలివిడత తీసే ఆకు అమ్ముకుంటే వచ్చే సొమ్ము తిరిగి పెట్టుబడిగా ఉపయోగ పడుతుందని ఆశించి అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. అయితే నల్ల బర్లీ కొనుగోళ్ల ఇంకా ప్రారంభం కాకపోవడంతో సాగుదారులు పెట్టుబడికి తీవ్రఇబ్బంది పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అదునుకు ఆకు తీసేందుకు కూలీల వెతుకులాటలో రైతులు సతమత మవుతున్నారు. కూలీల కొరత, పెరిగిన సాగు ఖర్చులు, కొనుగోలులో వ్యాపారులు అనుసరిస్తున్న నాణ్యతా ప్రమాణాలు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



కూలీల కొరతతో ఎండేందుకు పందిరిపై ఆరబెట్టకుండా గుట్టగా పడేసిఉన్న పొగాకు తాళ్ళు

5 వేల ఎకరాలకు పెరిగిన విస్తీర్ణం

మండలంలో ఈ ఏడాది బర్లీ సాగు 5 వేల ఎకరాల వరకు ఉంటుందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీనిలో తెల్ల బర్లీ సాగు 25 శాతం ఉండగా ఎక్కువ విస్తీర్ణంలో నల్లబర్లీ సాగవుతుంది. చందలూరు, తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, పంగులూరు, అరికట్లవారిపాలెం గ్రామాలతో పాటు బూదవాడ, చినమల్లవరం, అలవలపాడు గ్రామాలలో బర్లీ సాగు చేపట్టారు.

పెరిగిన సాగు వ్యయం

ఒక ఎకరాకు కౌలు 30 వేల వరకు ఉండగా ఎరువు 5 వేలు, వ్యవసాయం 10 వేలు, పురుగు మందు 3 వేలు, నారు, నాటు వేసినందుకు 11 వేలు, కలుపు, తీసిన ఆకు ఆర బెట్టేందుకు పందిరి, ఫురి 11 వేలు, ఆకు తీసి తాడుకు గుచ్చేందుకు కూలీల ఖర్చు ఎకరాకు 50 వేలు, ఇతర ఖర్చులు వెరసి లక్షా ముప్పైవేలు ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ఆకు వొలిచే కూలీలు దొరకక అదును దాటి చేలోనే పండుబారుతున్న ఆకు

కొనుగోళ్లకు కొర్రీలు

మార్కెట్లో తెల్ల బర్లీ కొనుగోళ్లను కంపెనీలు ప్రారంభించాయి. అయితే అడుగాకు, గుల్లాకు కొనుగోలుపై ఆసక్తి చూపడంలేదు. పైగా తేమ శాతం, నాణ్యత పేరుతో అనుసరిస్తున్న విధానం ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు. తెల్ల బర్లీ అమ్మకాలలో ఆకు పూర్తిస్థాయిలో ఎండబెట్టిన తర్వాతే తేవాలనే వ్యాపారుల షరతు రైతులను వేధిస్తుంది. సాగు చేసిన కొద్ది కాలానికి కురిసిన వర్షాలు, ఇటీవల అధికంగా కురిసిన మంచు ఆకు నాణ్యతపై ప్రభావం చూపగా వ్యాపారుల షరతులు రైతుకు ఇబ్బంది మారాయి, అమ్మకాలలో ఇదే పరిస్థితి కొనసాగితే నష్టాలు తప్పవని తెల్ల బర్లీ రైతులు, త్వరితగతిన కొనుగోళ్ల ప్రారంభించి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోతే తీవ్రంగా నష్ట పోతామని రైతులు ఆందోళన చెందు తున్నారు.

ఎకరాకు లక్షా ఇరవై వేలకు పైగా ఖర్చు



11 ఎకరాలలో బర్లీ సాగు చేపట్టాను. ఎకరాకు లక్షా ఇరవై వేలకు పైగా ఖర్చవుతుంది. గత ఏడాది పొగాకు సాగు లాభకరంగా ఉండటంతో ఈ ఏడాది విస్తీర్ణం పెంచి సాగు చేపట్టాను. దిగుబడులు కొంత ఆశాజనకంగా ఉన్నా కొనుగోళ్ల సరిగా లేక నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది.

- అడ్డగడ సతీష్, చందలూరు

ధర లేకుంటే నష్టమే...



ఆరెకరాలు కౌలుకు తీసుకుని బర్లీ సాగు చేపట్టాను. మార్కెట్లో వ్యాపారులు పొగాకు కొనుగోలు విషయంలో అనుసరిస్తున్న విధానం ఇబ్బందికరంగా ఉంది. దిగుబడి ఆశాజనకంగా ఉంది. అయితే సరైన ధర లభించకుంటే తీవ్రంగా నష్ట పోతాం.


-నాయపాము అంకారావు

'లాటరీ'.. వాయిదా

గీత కార్మికుల మద్యం షాపులకు కోడ్ బ్రేక్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గీత కార్మిక కులాలకు కేటాయించిన 12 మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా పడింది. 159 దరఖాస్తులు రాగా ఇందుకు సంబంధించి షాపుల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియ కలెక్టర్ సమక్షంలో సోమవారం జరుగుతుందని తొలుత ఎక్సైజ్ విభాగం ప్రకటించింది. కానీ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉండడంతో లాటరీ ప్రక్రియను వాయిదా వేస్తూ ఎక్సైజ్ విభాగం ఆదివారం నిర్ణయం తీసుకుంది. చీరాల, పర్చూరు, అద్దంకి పరిధిలోని షాపులకు తొలుత సోమవారమే లాటరీ తీద్దామని అధికారులు భావించినా కలెక్టరేట్ బాపట్లలోనే ఉండడం, ప్రక్రియ అంతా ఇక్కడ నుంచే జరపాల్సి రావడంతో మొత్తానికే వాయిదా వేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక పూర్తయ్యాక లాటరీ తేదీ ప్రకటిస్తామని ఈఎస్ దేవదత్తు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.



రోప్‌వే.. పిల్లర్ల దశలోనే

- కోటప్పకొండలో నిలిచిపోయిన నిర్మాణం
- గత టీడీపీ హయాంలో శంకుస్థాపన
- నిధులు విడుదల చేయని గత వైసీపీ ప్రభుత్వం
- ఇటీవల చంద్రబాబుకు వినతి.. సాధ్యాసాధ్యాలపై అధ్యయనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిసన్నిధి పర్యాటక కేం ద్రంగా రూపుదిద్దుకుంది. అయితే కొండ కు అదనపు హంగుగా ఉండాల్సిన రోప్‌వే నిర్మాణంపై అనుమానాలు నెలకొన్నాయి. కోట ప్పకొండ దిగువ నుంచి స్వామి సన్నిధికి గత టీడీపీ ప్రభుత్వ హయంలో రోప్‌వే నిర్మాణం మొదలైంది. అయితే వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చే యకపోవడంతో పనులు నిలిచిపో యాయి. గత టీడీపీ హయాంలో రోప్‌వే నిర్మాణానికి నాటి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు కృషి చేశారు. ఈ క్రమంలో రూ.6.82 కోట్లతో రోప్‌వే నిర్మాణ పనులకు ఆమోదం లభించింది. కొండ దిగువన ఉన్న పర్యాటకశాఖ ఉ ద్యానవనం నుంచి కొండ ఎగువన ఉన్న అతిథిగృహం పక్కన వరకు రోప్‌వే ని ర్మించాలని నిర్ణయించారు. 400 మీటర్ల పొడువు, 20 మీటర్ల వెడల్పున నిర్మాణం చేయాల్సి ఉంది. రోప్‌వే నిర్మాణంలో భాగంగా కొండ దిగువన ఉద్యానవనం స్థలంలో పిల్లర్లు కూడా నిర్మించారు. వైసీ పీ హయాంలో పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. గత ఐదేళ్లు రోప్ వే నిర్మాణం ఊసే పర్యాటక శాఖ ఎత్త లేదు. ఇటీవల సీఎం చంద్రబాబు కోట ప్పకొండను సందర్శించిన సమయంలో రోప్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు కోరారు. రోప్‌వే నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ను పనులు ప్రారంభించాలని పర్యాటక శాఖ ఆదేశించింది. బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనులు చేపట్టేందుకు కాం ట్రాక్టర్ సుముఖంగా లేరని తెలుస్తోంది. రోప్‌వే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం రోప్‌వేను నిర్మిస్తుందా.. నిలిపివేస్తుందా అన్న అంశం ఉన్నతాధికారులు రూపొందించే నివేదికపై ఆధారపడి ఉంది.

కూలికి వెళ్లొస్తూ... కాటికి



గంగమ్మ



మాధవి



సామ్రాజ్యం



పద్మ



గుంతలో పడి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రదేశం

కాల్వలో ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మృతి

- నాలుగు కుటుంబాల్లో అలుముకున్న విషాదం
- రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి విచారం
- మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ

ముప్పాళ్ల, సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. రోజులాగానే పనులకు వెళ్లి మిర్చి కోసి అదే టిక్కీలతో ట్రాక్టర్‌పై వస్తున్నారు. కబుర్లు చెప్పుకుంటూ వస్తున్న వారు.. వారు కూర్చొన్న టిక్కీల బస్తాలు, ట్రాక్టర్ ట్రక్కు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపై గుంతలతో అదుపుతప్పిన ట్రాక్టర్ కాల్వలో బోల్తా పడటంతో నలుగురు మహిళా కూలీలు మృతి చెందారు. ఆదివారం సాయంత్రం ముప్పాళ్ల మండలం బొల్లవరం శివారు మాదల మేజరు కాల్వ వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చాగంటివారిపాలేనికి చెందిన కూలీలు నలుగురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలేనికి చెందిన రైతు మువ్వా శ్రీకాంత్ బొల్లవరం గ్రామ శివారులో పొలం కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తున్నారు. 21 మంది కూలీలు తీసుకెళ్లడం.. పొలం నుంచి టిక్కీలను తీసుకు వచ్చేలా గ్రామానికి చెం దిన పోపూరి చిన్న ట్రాక్టర్‌ను అద్దెకు కుదు ర్చుకున్నాడు. రోజులాగా ట్రాక్టర్‌లో కూలీలను ఎక్కించుకుని, మిర్చి టిక్కీలు వేసుకుని ఆది వారం సాయంత్రం గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో మేజరు కాలువ గట్టు పక్కన రోడ్డు గుంతల మయంగా ఉండటంతో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో మిర్చి టిక్కీ లపై కూర్చున్న కూలీలు కింద పడటంతో వారిపై మిర్చి టిక్కీలతో పాటు ట్రాక్టర్ ట్రాలీ పడింది. ఈ ప్రమాదంలో తేనేపల్లి పద్మ (46), మధిర సామ్రాజ్యం(55), మధిర గం గమ్మ(60) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చక్కెర మాధవి(30) సత్తెన పల్లి ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. ట్రాక్టర్ పడబోతుందని గమనించిన కూలీలు కొంత మంది ట్రక్కుపై నుంచి దూకడంతో కొందరు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్పీ శ్రీనివాసరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐ ఎంవీ సుబ్బారావు సందర్శించారు. తహసీల్దార్ భవానీశంకర్ సత్తెన పల్లి ఏరియా వైద్యశాలలో క్షతగాత్రులను, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముప్పాళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.



సంఘటన జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

చాగంటివారిపాలెంలో విషాదం

రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో చాగంటివారిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోజు తమతో పాటు కలసి మెలసి తిరుగుతూ కబుర్లు చెప్పే మహిళలు మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కూలీల కుటుంబాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

తల్లి అవయవాలు దానం చేస్తా..

మృతి చెందిన తల్లి అవయవాలను దానం చేస్తానని పద్మావతి కుమారుడు సాయిలక్ష్మణా చారి ఏరియా వైద్యశాలలో విలేకర్లకు తెలిపారు. తాము, తమ సోదరి ఉన్నామని, సోదరికి వివాహం జరిగిందని, తండ్రి కార్పెంటర్‌గా పని చేస్తుంటారన్నారు. తల్లి కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. ప్రమాదంలో తల్లి మృతి చెందడం కుటుంబానికి తీరని లోటన్నారు.

రోజూ ఉపాధి పనులకెళ్లేది..

మా అత్త మధిర గంగమ్మ రోజూ గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులకు వెళ్లేదని కోడలు రజిని తెలిపింది. తోటి గ్రామస్తులు మిర్చి కోతలకు వెళ్తుండటంతో వారితో కలిసి ఆదివారం వెళ్లిందన్నారు. రోజూలానే ఉపాధి పనులకు వెళ్లి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవన్నారు. కుటుంబానికి అండగా ఉండే అత్త మృతిపై ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తమది పేద కుటుంబం అని ఆమె తెలిపింది.

ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం

గుంటూరు (ఆంధ్రజ్యోతి): బొల్లవరం శివారులో ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు కూలీలు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. పొలం పనులు ముగించుకుని ఇంటికి చేరుకునే సమయంలో ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి ఎం రామ్ ప్రసాదరెడ్డి కూడా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై పల్నాడు ఎస్పీతో, ముప్పాళ్ల మండల అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే కన్నా దిగ్భ్రాంతి

చాగంటివారిపాలేనికి చెందిన నలుగురు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

యద్దనపూడిలో మంత్రి గొట్టిపాటి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం సొంతగ్రామం యద్దనపూడికి విచ్చేశారు. ఆయన నాయనమ్మ గొట్టిపాటి సుబ్బాయమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా మంత్రి రవికుమార్ తోపాటు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కూడా వచ్చారు.

నేడు అంబడిపూడిలో లేగ దూడల ప్రదర్శన

బల్లికురవ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పశుగణాభివృద్ధి సంస్థ ఒంగోలు, బాపట్ల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేడు సోమవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ మేలు జాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం అంబడిపూడిలో జరుగుతుందని పశు వైద్యాధికారి పావనీకుమారి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు, ప్రజలు లేగ దూడల ప్రదర్శనను వీక్షించాలని ఆమె కోరారు.

జోరుగా మరమ్మతులు


యద్దనపూడి - యనమదల గ్రామాల మధ్య పూడ్చిన గుంతలు


చింతపల్లిపాడు - యనమదల మధ్య తారుతో పూడ్చిన గుంతలు

- మార్టూరు - పర్చూరు రోడ్డులో పనులు
- తారుతో పూడుస్తున్న గుంతలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు నుంచి డేగరమూడి మీదుగా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు మీదుగా యద్దనపూడి నుంచి పర్చూరు వెళ్లే రోడ్డులో రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ రోడ్డుపై చింతపల్లిపాడు, యనమదల గ్రామాల మధ్య, యనమదల నుంచి యద్దనపూడి వరకు, అదేవిధంగా యద్దనపూడి నుంచి పెదజాగర్లమూడి మీదుగా పర్చూరు వరకు చాలా చోట్ల తారు లేచిపోయి కంకర బయటపడి పెద్దగుంతలు ఏర్పడ్డాయి. వాస్తవంగా ఈ రోడ్డులో మార్టూరు నుంచి పర్చూరు ప్రాంతానికి కంకర, గ్రావెల్‌ను భారీగా తరలించే వాహనాలు కారణంగా చాలా చోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవ తీసుకోవడంతో రోడ్డు మరమ్మతు పనులు త్వరితంగా మొదలయ్యాయి. గత నెల రోజుల నుంచి రోడ్డు మరమ్మతు పనులు స్పీడందుకున్నాయి. దాంతో ఈ రోడ్డులో ఇప్పటికే కొంతమేర రోడ్డుపై గుంతలను పూడ్చారు. ముఖ్యంగా చింతపల్లిపాడు నుంచి యనమదల గ్రామంలో నుంచి ఆంజనేయస్వామి కూడలి మీదగా యద్దనపూడి వరకు ఉన్న చాలా గుంతలను పూడ్చివేశారు. గతంలో యనమదలలో ఆంజనేయస్వామి కూడలి వరకు లోతైన గుంతలు కారణంగా వాహనదారులు, ప్రజానీకం చాలా ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతు పనులు జరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో నెలరోజులలోపు దాదాపుగా రోడ్డు మరమ్మతులు పనులు పూర్తిగా మార్టూరు నుంచి పర్చూరు వరకు పూర్తయ్యే అవకాశం ఉంది.


ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులకు అండగా ఉండి, వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌వీఎస్‌ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆధునికీకరణలకు సంబంధించి భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్నట్లు చెప్పారు. సమస్యలు నేరుగా ఆయన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అలాగే ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్లో జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపుల కేటాయింపు వాయిదా

పర్చూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను వాయిదా వేసినట్లు పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.భుజంగరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా సోమవారం జరగాల్సిన బహిరంగ షాప్ కేటాయింపు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈవిషయాన్ని షాపుల కోసం దరకాస్తు చేస్తున్న గీత కార్మికులు గుర్తించాలని కోరారు.

శేష జీవితం ఆనందంగా సాగాలి


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

జాండ్రపేట (చీరాలటౌన్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవిత పోరాటంలో అడుగడుగునా శ్రమించి వివిధ రంగాల్లో సేవలు అందించి శేష జీవితం ఆనందంగా గడపాలని సాహితీవేత్త బట్టా మోహన్‌రావు అన్నారు. మండల పరిధిలోని జాండ్రపేట హైస్కూల్లో 1979- 80 పదవ తరగతి పూర్తి చేసి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సేవలందించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఆదివారం జాండ్రపేట శివాలయం ప్రాంగణంలో సన్మానించారు.కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్, గంగాధర్, వాసుదేవ్‌సింగ్, శ్రీలక్ష్మీ, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, శివప్రసాద్, రాహుల్, సుబ్రహ్మణ్యం, వనజలత, నాగేశ్వరరావు, త్రిపురాంతకం పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల బహూకరణ

పర్చూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటేరియన్ కొల్లా శ్రీనివాసరావు తండ్రి జ్ఞాపకార్థం పర్చూరు సెంట్రల్‌కు 15 సిమెంట్ బల్లలను ఆదివారం నాగులపాలెం పంచాయతీకి బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు విశ్రాంతి తీసుకునే విధంగా గ్రామాల్లో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కొల్లా నరేంద్రకుమార్, పాబోలు ఉదయ భాస్కర్, రావి సత్యనారాయణ, కోటా హరిప్రసాద్, నాగభైరు శ్రీనివాసరావు, కెఎస్‌ఆర్‌కె ప్రసాద్, పొలిశెట్టి చంద్రం, పాబోలు వెంకన్న రావిసతీష్‌బాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రవాసాంధ్రుడు జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు మన్నెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కారంచేడు మండలంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన నాయకులు సంయుక్తంగా పాల్గొని నిరుపేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీధర్, నారిశెట్టి ప్రవీణ్ కుమార్, గనిపిశెట్టి అయ్యప్ప, కృష్ణారెడ్డి, మహేష్, అశోక్, టీడీపీ నాయకులు జాగర్లమూడి నాని, ప్రహ్లాద, చాగంటి కోటేశ్వరరావు, కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైటమంజులూరు వాసి మృతి

పంగులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైటమంజులూరు గ్రామవాసి మృతి చెందారు. బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సరికొండ రవిరాజు (50) కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన రవిరాజు అన్న కుమారుడి వివాహం జరగాల్సి ఉండగా, సికింద్రాబాద్‌లోని తన బంధువులకు కార్డులు పంచేందుకు తన బాబాయి కుమారుడితో ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ బలంగా ఢీకొనడంతో వాహనం నడుపుతున్న రవిరాజుకు తీవ్ర గాయాలు కాగా, వెనుక సీటులో ఉన్న బాబాయి కొడుకుకు స్వల్ప గాయాలయ్యాయి. రవిరాజును చికిత్స కోసం వైద్యశాలకు తరలిస్తుండగా మరణించినట్లు బంధువులు తెలిపారు. రవిరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒకరు డిగ్రీ, మరొకరు ఇంజనీరింగ్ చదువుతున్నట్లు సమాచారం.

ఎడ్ల బండిపై అంతిమయాత్ర

అద్దంకి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సామాజిక వర్గం అయినా, భూస్వామి కుటుంబం అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో స్వయంగా వ్యవసాయం చేసిన చిన్ని సుధాకరరావు(82) అంతిమయాత్ర ఆదివారం ఎడ్లబండిపై నిర్వహించారు. అద్దంకి మండలంలోని వేలమూరిపాడుకు చెందిన చిన్ని శాంతయ్య కుటుంబం అద్దంకి ప్రాంతంలో పెద్ద భూస్వామి కుటుంబం. అనంతరం అద్దంకి వచ్చి స్థిరపడ్డారు. చిన్ని శాంతయ్య మనువడు అయిన సుధాకరరావు కూడా స్వయంగా వ్యవసాయం చేశారు. ఎడ్లు అంటే ఎంతో మమకారంగా చూసుకునే వారు. అనంతరం సుధాకరరావు కుమారుడు శ్రీహరిరావు వ్యాపారంలో స్థిరపడ్డారు. సుధాకారరావుకు ఎడ్లు అంటే ఇష్టం కాబట్టి ఆయన అంతిమయాత్రను ఆదివారం సాయంత్రం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి నర్రావారిపాలెం శ్మశానం వరకు ఎడ్ల బండిపై నిర్వహించారు. భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీహరిరావు అంత్యక్రియలు నిర్వహించారు. సుధాకరరావు మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.


ఎడ్ల బండిపై సాగుతున్న చిన్ని సుధాకరరావు అంతిమయాత్ర



వందనకు బహుమతిని అందజేస్తున్న ఖాసిం

చేతిరాత పోటీలో వందనకు తృతీయ స్థానం

మార్టూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి లుసిడా చేతిరాతల పోటీలు శనివారం గుంటూరులో హిందూ కాలేజీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా నుంచి నలుగురు విద్యార్థినులు పాల్గొనగా వారిలో లెవెల్ 4 సీనియర్ విద్యార్థుల విభాగంలో మార్టూరు జడ్‌పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని జంధ్రాజుపల్లి వందన మూడవ బహుమతిని సాధించారు. బహుమతిని అందుకున్న వందనకు యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో ఎస్‌జీటీ టీచర్‌గా పనిచేస్తున్న మాలంపాటి శారద శిక్షణ ఇచ్చారు. గుంటూరులో ఉర్దూ స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖాసిం చేతులమీదగా వందనకు బహుమతిని, వెయ్యి రూపాయల నగదును అందచేశారు. వందనను ప్రధానోపాధ్యాయులు రూత్‌మెర్సీ జాయ్ ఉపాధ్యాయులు తుర్లపాటి శ్రీనివాసు, శేషగిరిరావు, అన్నం శ్రీనివాసరావు, అడిగొప్పుల శ్రీనివాసరావు, చట్టి శ్రీనివాసరావు అభినందించారు.

జనసేన పార్టీ కార్యకర్త కుటుంబానికి సాయం

అద్దంకి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని బత్తులవారిపాలెంకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త బత్తుల శివశంకర్ (35) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. పేద కుటుంబం కావడంతో జనసేన పార్టీ నేతలు తమ వంతుగా ఆదివారం శివశంకర్ కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన పార్టీ నేతలు గోరంట్ల సాయి, చల్లా కృష్ణ, బత్తుల చందు, జక్కం చిరంజీవి, మురళి, బెల్లంకొండ మధు, సాంబయ్య, గోపి, వీరాచారి, సాధు వెంకటేష్, చంద్ర పాల్గొన్నారు.

హేతువాద గ్రంథాల ఆవిష్కరణ

ఇంకొల్లు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా అధ్యయన తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా పలు హేతువాత గ్రంథాలను ఆవిష్కరించారు. మేడూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో హేతువాద, మానవవాదం గురించి ప్రముఖులు మాట్లాడారు. హేతువాద మానవవాద ప్రతిభ పరీక్షలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో షేక్‌బాబు, డా.గుమ్మా వీరన్న, రవీంద్రబాబు, వలి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రాజశేఖర్, శాంతికుమార్, కరి హరిబాబు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీ

అద్దంకి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఆరబెట్టిన మిర్చి చోరీ జరిగిన ఘటనపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలం కుంకుపాడు పంచాయతీ పరిధిలోని రాళ్లపల్లికి చెందిన వద్దినీడి శ్రీను తాళ్లూరు మండలం మల్కాపురంలో 1.50 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని మిర్చిని సాగు చేశారు. మిర్చి కోసి ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఆరబెట్టారు. ఈ నెల 7వ తేదీ ఉదయం చూడగా ఆరబెట్టిన మిర్చి చోరీకి గురైనట్లు గుర్తించారు. రూ.1.50లక్షల విలువైన 10 క్వింటాళ్ల ఎండు మిర్చి అపహరణకు గురైనట్లు ఆదివారం శ్రీను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఆరోగ్యశ్రీకి మహర్దశ

- వైద్య రంగానికి సీఎం చంద్రబాబు పెద్దపీట
- వైసీపీ పాలనలో వైద్యం అందక మృత్యుఘోష
- హాస్పిటల్ ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి


చీరాలలో గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే కొండయ్య, హాస్పిటల్ ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి పాలనలో ఆరోగ్యశ్రీకి మహర్దశ పట్టిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. చీరాల ఎల్‌బీఎస్ నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ 100 పడకల హాస్పిటల్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో పేదలకు వైద్య సేవలు అందలేదని విమర్శించారు. ఎంతోమంది మృత్యువాత పడ్డారని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని, ప్రజా సేవలో సాగుతున్న ప్రైవేటు వైద్య సంస్థలకు మద్దతు ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధునిక ఆలోచనలతో వైద్య రంగంలో ప్రాముఖ్యత కలిగిన ఆరోగ్యశ్రీని ముందంజలో ఉంచుతామన్నారు. జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా 100 పడకల హాస్పిటల్ నిర్మించి 24 గంటలు సేవలందించాలనే ఆలోచన అభినందనీయమని హాస్పిటల్ ప్రతినిధులు డాక్టర్ గోరంట్ల రాజేష్ దంపతులను, సిబ్బందిని ప్రశంసించారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ప్రకాశం, బాపట్ల జిల్లాల అభివృద్ధికి మంత్రి గొట్టిపాటి నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

శ్రీవాసవీ దేవస్థానం నూతన కమిటీ

మార్టూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో బొడ్డురాయి సెంటర్ సమీపంలో నూతనంగా ని ర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నూతన కమిటీ ఎంపిక ఆదివారం దేవస్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ మామిడిపాక హరి ప్రసాద్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు ఎంపిక చేసిన నూతన కమిటీ సభ్యులను మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆత్మకూరి సీతారామాంజనేయులు ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మద్దు సీతారామయ్య (నాని), సెక్రటరీగా కనమర్లపూడి నవీన్, ట్రెజరర్‌గా మోదడుగు మురళిని మూడేళ్ల కాలపరిమితితో ఎంపిక చేశారు. మిగిలిన కమిటీ సభ్యులను త్వరలో ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త పొత్తూరి సుబ్బారావు, మోహనరావు, దేవస్థానం గౌరవాధ్యక్షుడు శ్రీరాం శేషగిరిరావు, చేబ్రోలు నారాయణమూర్తి, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలూరు, అనంతవరం ఫిల్టర్ బెడ్‌లకు నిధులు

ఎమ్మెల్యే ఏలూరి కృషితో రూ.18.50లక్షలు మంజూరు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని రెండుగ్రామాలకు చెందిన ఫిల్టర్ బెడ్‌లకు డీఎంఎఫ్ నిధులు రూ.18.50లక్షల మంజూరుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేశారు. ఈ మేరకు అనంతవరానికి రూ.10లక్షలు, పోలూరుకు రూ.8.50లక్షలు రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషితో కలెక్టర్, ఛైర్మన్ జే వెంకటమురళి డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు గ్రామాలలో ఫిల్టర్ బెడ్‌లు సక్రమంగా లేకపోవడంతో గ్రామాలలో ప్రజలకు రక్షిత తాగునీరు అందడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ గ్రామ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి సమస్యను విన్నవించారు. దాంతో ఏలూరి రెండు గ్రామాలలోని ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అంచనాలు మేరకు అంచనా వ్యయం రూ.10లక్షలు, రూ.8.50లక్షలు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఆర్డర్ జారీ విడివిడిగా జారీ చేశారు. దాంతో పోలూరు, అనంతవరం గ్రామస్థులు త్వరలో ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతు చేసిన తర్వాత సురక్షితమైన తాగు నీటిని గ్రామాలలో పంపిణీ చేస్తారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వీర్ల గంగమ్మ ముఖద్వారం అభివృద్ధి


ముఖ ద్వారానికి బొమ్మలు వేస్తున్న కూలీలు


బల్లికురవ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీర్ల గంగమ్మ తల్లి ముఖ ద్వారం ఇటీవల గ్రానైట్ లారీ తగిలి అమ్మవారి బొమ్మలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా స్థానిక వీర్లకొండ వద్ద ఎస్ఆర్ గ్రానైట్ క్వారీ యజమానులు అమ్మవారి ముఖద్వారాన్ని తిరిగి గతంలో మాదిరిగా అభివృద్ధి చేయిస్తున్నారు. ముఖద్వారం పైన అమ్మవారి బొమ్మలు పెట్టేందుకు కూలీలు పనులు శరవేగంగా చేస్తున్నారు. అమ్మవారి దేవాలయ ముఖ ద్వారం అభివృద్ధి చేసి రానున్న తిరునాళ్లకు అమ్మవారి దేవాలయాన్ని ముస్తాబు చేసేందుకు దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి గొట్టిపాటి చొరవతో తీరిన దారి సమస్య

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన రైతులు


డొంక రోడ్డుకు భూమిపూజ చేస్తున్న టీడీపీ నేత అంజయ్య

పంగులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమూరు పొలాలకు చేరుకునే దారి సమస్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పరిష్కారం లభించింది. జాగర్లమూడివారిపాలెం ఫ్లైవోవర్‌కు తూర్పు వైపుగా సర్వీస్ రోడ్డు నుంచి కొండమూరు వైపు పొలాలకు చేరుకునేందుకు దశాబ్దాలుగా దారి సమస్య ఏర్పడింది. ఈ నెల 1న ముప్పవరం టీడీపీ కార్యాలయంలో సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేపట్టిన సమీక్షలో ఆ ప్రాంత రైతులు పొలాలకు చేరుకునేందుకు దారి సమస్యతో పడుతున్న ఇబ్బందిని వివరించారు. సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి తగిన పరిష్కారం చూపాలంటూ తహసీల్దార్ సింగారావును ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత రైతులతో చర్చించి పొలాలకు చేరుకునే దారికి అటంకం లేకుండా తహసీల్దార్ సింగారావు సమస్యకు పరిష్కారం చూపా రు. దీనితో 200 ఎకరాలకు చేరుకునేందుకు మార్గం సుగమం అవడంతో ఆ ప్రాంత రైతులు డొంక రహదారిలో రోడ్డు నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. మంత్రి గొట్టిపాటికి కొండమూరు, జేవీపాలెం, ముప్పవరం రైతులు కృతజ్ఞతలు తెలిపారు.





ఆత్మకూరులో ఆదివారం పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు తదితరులు

ఆగిన అభివృద్ధిని పట్టాలెక్కించాం

- టిడ్కో గృహసముదాయల్లో రామాలయాల నిర్మాణం
- ఎన్డీఏ ప్రభుత్వం బీసీల ప్రభుత్వం
- వైసీపీ పాలనలో కుంటుపడిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం
- జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు
- ఆత్మకూరులో రాష్ట్ర మంత్రుల వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మకూరులో ఆగిపోయిన అభివృద్ధిని పట్టాలెక్కించాం. ఉమ్మడి ఏపీలో జరిగిన అభివృద్ధిని ఒక్క శాతం కూడా వైసీపీ ఎమ్మెల్యేలు ముందుకు తీసుకెళ్లలేకపోయారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సోమశిల అభివృద్ధికి తట్టెడు మట్టి వేయలేదు. యువగళం పాదయాత్రలో ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టాలెక్కిస్తామని హామీ ఇచ్చాం. ఆత్మకూరు అభివృద్ధిలో రాష్ట్రమంత్రులు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం బీసీల ప్రభుత్వం. జిల్లాలో రోడ్ల నిర్మాణం కోసం రూ. 37 వేల కోట్లు కేటాయించాం'.. అని ఆదివారం ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

దేవదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగ్గా, ఐదుగురు రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతి నిధులు, జిల్లా ఉన్నతాధికారులు తరలి వచ్చారు. వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ముందుగా ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సోమశిల జలాశయం అభివృద్ధికి తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. ప్రాజెక్టు పరిస్థితి అయోమయంగా మారినా పట్టించుకోలేదని విమర్శించారు. అమృత్ పథకం కింద ఆత్మకూరుకి రూ. 10 కోట్లు ఇస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్రం నుంచి హౌసింగ్ నిధుల కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏఎస్‌పేట దర్గా అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నిధులు ఇస్తామని తెలిపారన్నారు. ఇలా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో రాష్ట్ర మంత్రులు, ఎంపీ, పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఆనం తెలిపారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు రూ. 36 వేల కోట్లు కేటాయించి, బీసీల పక్షపాతిగా నిలిచిందన్నారు. పాఠశాలల్లో పేరుకుపోయిన డైట్ బిల్లుల బకాయిలను సరిచేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి అన్ని హాస్టళ్లలోని విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టాలని మంత్రి నారా లోకేష్ భావిస్తున్నారని ఆమె వెల్లడించారు.

ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని 27 వేల కి.మీ రోడ్లలో బైకులు కూడా తిరిగే పరిస్థితి కూడా లేదని, వాటిన్నంటిని పునర్ నిర్మిస్తామని తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ. 37 వేల కోట్లు

టిడ్కో ఇళ్ల సముదాయల్లో రామాలయాల నిర్మాణం

మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 67 ప్రాంతాల్లో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద రామాలయాల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఇందులో మొదటిగా ఆత్మకూరులో శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. జగన్ ప్రభుత్వ అసమర్థత వల్ల స్వచ్ఛభారత్, అమృత్ పథకాల నిధులు వెనక్కి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ నియోజకవర్గాలను ఎమ్మెల్యేలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నదని ఆయన పేర్కొన్నారు.

పేదలకో సువర్ణావకాశం

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా
- ఆక్రమిత స్థలాల రెగ్యులరైజేషన్‌కు ఆదేశాలు

- 150 గజాల్లోపు ఇల్లుంటే ఉచితంగా పట్టా
- 150 నుంచి 300 గజాల్లోపు 15 శాతం ఫీజుతో డీడ్
- 2019 అక్టోబరు 15 వరకు కటాఫ్‌గా నిర్ణయం
- ఈఏడాది చివరివరకు దరఖాస్తుకు అవకాశం

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆ ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు పేదలకు పట్టాలు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విధివిధానాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 అక్టోబరు 15 నాటికి ఎవరైతే అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారో.. అలాంటి వారందరినీ అర్హులుగా చేరుస్తూ జీవో విడుదల చేసింది. పేదలకు ఉచితంగా పట్టాలు ఇవ్వడమే కాక, ఇతరులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొని ఉన్నా, వారికి నిర్దీతధర ప్రకారం కన్వేయన్స్ డీడ్ ద్వారా హక్కులు కల్పించేందుకు కూడా అవకాశం ఇచ్చింది. ఈ నిర్ణయంతో జిల్లాలో వేలాదిమంది పేదలకు ఇళ్ల పట్టాలు దక్కనున్నాయి. అలానే ఇతరులకు కూడా వారి ఇళ్లపై అధికారిక హక్కులు రానున్నాయి. ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు ఈ ఏడాది ఆఖరువరకూ సమయమిచ్చారు. అప్పట్లోగా సచివాలయాల ద్వారా అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మహిళల పేరిట మాత్రమే పట్టాలు మంజూరు చేస్తారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ఈ స్కీం కింద పరిగణలోకి తీసుకుంటారు. ముందుగా తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాసులు పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే డివిజనల్ స్థాయి కమిటీకి పంపుతారు. అక్కడ పరిశీలించి అర్హుల జాబితా ప్రకటిస్తారు. ఇలా అప్రూవల్ అయిన వెంటనే ఆ జాబితాను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు పంపుతారు.

నిబంధనలు ఇవి...

- అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ రెగ్యులరైజేషన్ పథకం వర్తిస్తుంది. లేఅవుట్‌లో ఓపెన్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ ప్రాంతాలు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లోని నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన ఇతర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే అలాంటి వాటిని క్రమబద్ధీకరించరు.
- పేదలకు 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. వీరు రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, 150 నుంచి 300 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉంటే అలాంటి వారు భూమి బేసిక్ ధరలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం భరించాలి. ఈ కేటగిరిలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- 300 నుంచి 450 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉన్న బీపీఎల్ కుటుంబాలు భూమి విలువలో వంద శాతం చెల్లించడంతోపాటు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాలి. అదే ఉన్నత వర్గాలకు చెందినవారు భూమి విలువలో 200 శాతం చెల్లించడంతోపాటు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును భరించాల్సి ఉంటుంది. ఇక 450 గజాలకు మించి ఎవరు ఆక్రమణలో ఉన్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు చెల్లించడంతో పాటు వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలి.
- ఆక్రమించుకుని ఖాళీగా ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించరు. కనీసం రేకుల ఇళ్లయినా ఆ స్థలంలో ఉండాలి. అది కూడా 2019 అక్టోబరు 15కు ముందు నుంచే ఉండాలి. ఇందుకు ఆధారంగా ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, నీటి పన్ను వంటి వాటిని పరి గణలోకి తీసుకుంటారు. ఇంతకుముందు క్రమబద్ధీకరణ పథకం కింద లబ్ధి పొందిన వారికి ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. క్రమబద్ధీకరించుకున్న రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారు.



నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 121 కేంద్రాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు,పాల్గొన్న ఇతర అధికారులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం (నేటి) నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇందుకుగాను అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 121 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరపనున్నారు. ఈనెల ఐదోతేదీ నుంచి ఒకేషనల్ విద్యార్థులకు ప్రారంభమైన ప్రాక్టికల్స్ ఈనెల 20వతేదీ వరకు మూడో దశల్లో జరగనున్నాయి. జనరల్ సైన్స్ విద్యార్థులకు సోమవారం (ఈనెల 10) నుంచి రెండు దశల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. జనరల్ సైన్స్‌లో ఎంపీసీకి 19,684 మంది, బైపీసీకి 3,823 మంది కలిపి మొత్తం 23.507 మంది ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారు. జనరల్ విద్యార్థులకు ఈనెల 10 నుంచి 14వతేదీ వరకు మొదటి దశ, 15 నుంచి 19వతేదీ రెండోదశలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు వివరాలను వెల్లడించారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ

నాన్‌జంబ్లింగ్ విధానంలో, సెల్ఫ్ సెంటర్లలో జరిగే ప్రాక్టికల్స్‌లో కార్పొరేట్‌లకు కళ్లెం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అవకతవకలు జరిగినా, ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్ఐవో హెచ్చరించారు. పరీక్షల పేరుతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల వద్ద నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతూ, వాస్తవాలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత యాజమాన్యాలపై ప్రత్యేక దృష్టిసారించి, బోర్డు నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఎలాంటి వదంతులు నమ్మకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు. అలాగే ఈ ఏడాది ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే ఎప్పటికప్పుడు మార్కులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్య, రవాణా, విద్యుత్, పోస్టల్, మునిసిపల్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సమ న్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి, పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

నిరంతర పర్యవేక్షణ

ఈ పరీక్షలకు 400 మంది ఎగ్జామినర్‌లు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీలను నియమించామని, వీరు నిరంతరం పరీక్షలను పర్యవేక్షించడంతోపాటు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటారని ఆర్ఐవో తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష సమయానికి అరగంట ముందు మాత్రమే ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉన్నందున లీకేజీకి ఎలాంటి అవకాశం ఉండదన్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఏరోజుకు ఆరోజు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తా మన్నారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి పరీక్షలకు సిద్ధం చేసినందున ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల న్నారు. హాల్‌టికెట్ అందని వారు ఇంటర్‌బోర్డు వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య ఉంటే 0861-2320312 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్వహణకు కమిటీ

ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని నియమించారు. ఆర్ఐవో కన్వీనర్‌గా, సభ్యులుగా ప్రిన్సిపాళ్లు బీడీ.దీనదయాళ్, పీ. వేణుగోపాల్, అధ్యాపకులు కే.కొండయ్య, సీహెచ్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రాక్టికల్స్ ఆయా కళాశాలల్లోని ల్యాబ్‌ల్లోనే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రాక్టికల్స్ జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను పరిశీలించారు. సమస్యలున్న ప్రాంతాల్లో వెంటనే సరిదిద్ది సరైన పద్ధతిలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆర్ఐవో ఆదేశాలు జారీ చేశారు.

ఏయే పోస్టులు ఎవరెవరికి ?

- నామినేటెడ్ పదవుల జాబితా ఇవ్వాలని ఫరూక్ సూచన
- కొన్నింటి విషయమై వాడివేడిగా చర్చ
- బీసీ భవన్ నిర్మాణానికి ఆమోదం
- పార్టీ కొత్త కార్యాలయ నిర్మాణానికి నిర్ణయం
- టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు



నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ఇంటూరి, పార్టీ నేత బీద రవిచంద్ర

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు చేశారు. ప్రధానంగా నామినేటెడ్ పదవులపై వాడివేడి చర్చ జరిగింది. టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి ముఖ్య నేతలంతా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు సమావేశం జరిగింది. జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను ఏయే నియోజకవర్గానికి కేటాయించాలి..? అన్న దానిపై చర్చించా రు. ఈ సందర్భంగా ముఖ్యులంతా తమ తమ అభిప్రాయాలు చెప్పారు.

జీపీ, ఏజీపీ, ఏపీపీల నియామకంపై చర్చ

జిల్లా గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా శ్రీహరినారాయణరావును నియమిస్తూ ప్రభుత్వం గత నెలలోనే జీవో ఇచ్చింది. అయితే దీనిపై అభ్యంతరం చెప్పిన కొందరు ముఖ్యనేతలు ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ విషయమై ముందుగా చర్చ జరగ్గా నెల్లూరుకు చెందిన మరో లీగల్ సెల్ నాయకుడిని జీపీగా నియమించాలని కొందరు ప్రతిపాదించారు. అయితే సీఎం ఆమోదించిన తర్వాత నియామకమైన శ్రీహరినారాయణరావును కొనసాగించాలని సోమిరెడ్డి సూచించారు. చివరకు జీపీని కొనసాగిస్తూ నెల్లూరుకు చెందిన లీగల్‌సెల్ నాయకుడిని ఏజీపీగా నియమించాలని నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత అతడికి జీపీగా అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. ఇక ఏపీపీల నియా మకంపైన కూడా చర్చించారు. పార్టీ కోసం పనిచేసిన పలువురికి అవకాశం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

ఏ పోస్టు ఏ నియోజకవర్గానికి.. ?

ఇకపోతే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోస్టును నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి, సహకార బ్యాంక్ చైర్మన్ పోస్టును కావలి నియోజకవర్గానికి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిసింది. ఇక మిగిలిన పోస్టులకు కూడా అర్హులైన వారి జాబితాను అందించాలని ఎమ్మెల్యేలను ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ కోరారు. నుడాకు డైరెక్టర్లను నియమించే అంశమూ చర్చకు రాగా, ఇప్పటికైతే డైరెక్టర్ల నియామకం అవసరం లేదని, ఆ అంశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణానికి గతంలో శిలాఫలకం వేశామని, దాన్ని వైసీపీ హయాంలో పగలగొట్టిన విషయాన్ని బీద రవిచంద్ర ప్రస్తావించారు. ఆ శిలాఫలకాన్ని పునర్‌నిర్మించి, వెంటనే బీసీ భవన్ నిర్మాణం చేపట్టాలని ఆయన కోరగా సమావేశంలో ఆమోదించారు.

కొత్త కార్యాలయ నిర్మాణానికి నిర్ణయం

నెల్లూరులో కొత్తగా టీడీపీ కార్యాలయం నిర్మించాలని తీర్మానించారు. ఎకరా స్థలంలో నిర్మించాలని, అందుకు అవసరమైన భూమిని కొనుగోలు చేయడమా.. లేక ప్రభుత్వం నుంచి లీజుకు తీసు కోవడమా...? అన్నది పరిశీలించాలని నిర్ణయించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చిస్తామని మంత్రులు చెప్పారు. విలీనం కారణంగా కొన్ని పాఠశాలలు మూతపడే అవకాశాలున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునే లా అధికారులకు సూచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణంపై కూడా చర్చ జరిగింది. కాగా సమన్వయ కమిటీ సమావేశం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొ ని కలెక్టర్ ఓ ఆనంద్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఇక్కడ కూడా ఎయిర్‌పోర్టుపై చర్చించారు. సమావేశం నుంచే కేంద్ర పౌరవిమానయాన మంత్రి కే రామ్మోహన్‌నాయుడుతో మంత్రి నారాయణ ఫోన్లో మాట్లాడారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే కమిటీని పంపి పనులు మొదలు పెట్టే అవకాశాలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఇకపోతే బిట్రగుంటలో రైల్వే స్థలాల అభివృద్ధి, రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ డెయిరీలకు పాలు పోయాలి



పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ రంగ సంస్థల్లోని డెయిరీలకు మాత్రమే పాలు పోయాలని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నార్త్మోపూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో ఆదివారం రాత్రి పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీవార్మింగ్‌పై అవగాహన సదస్సు

లింగసముద్రం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంను జయప్రదం చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 4,265మంది బాల బాలికలకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,460మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్డీఎస్ పని జరుగుతున్న దృష్ట్యా అన్ని 11కేవీ ఫీడర్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రవాణశాఖ అధికారులు

కావలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలకు రక్షణ పొందాలని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీబాయ్‌లు తెలిపారు. ఆదివారం వారు ముసునూరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీవో సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టామన్నారు.

ఆక్రమణల తొలగించాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల శ్మశానంలో చేపట్టిన ఆక్రమణలను తొలగించి ఆ స్థలంను వారికి అప్పగించాలని ఉలవపాడు సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ ప్రభుత్వ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీలో బడ్జట్‌పై ప్రచార ఉద్యమంలో భాగంగా ఆయన గిరిజనులతో సమావేశం అయినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వం గిరిజనులకు ఈ స్థలం కేటాయించగా కొందరు రైతులు ఇటీవల కాలంలో జామాయిల్ మొక్కలు వేసి ఆక్రమించుకోవడం విచారకరం అన్నారు.

'దాడి అమానుషం'

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాన్ని తొలగించాలని విశాలాంధ్ర బుక్ షాపు యాజమాన్యంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తిరుపతి నగరంలో ఇస్కాన్ పక్కనే ఉన్న టీటీడీ గ్రౌండ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన సమయంలో శనివారం రాత్రి 8గంటల సమయంలో కొందరు హిందూవాదులు పెరియార్ జీవిత చరిత్ర పుస్తకం తొలగించాలని వాగ్వాదం చేస్తూ యాజమాన్యంపై దాడికి పాల్పడటం విచారకరం అన్నారు. ఇది రచన, ప్రగతిశీల భావాలపై దాడిగా జరిగిన దాడిగా భావించారు.

నేతల నివాళి

బిట్రగుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు సీనియర్ టీడీపీ నేత, రైల్వే విశ్రాంత ఉద్యోగి మేకల వెంకటేశ్వర్లు (67) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి ముంతాల వెంకయ్య, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ వెంకటేశ్వర్లు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రైల్వే పెన్షన్ అసోసియేషన్ కార్యదరి గోవిందరాజులు, సభ్యులు, పావని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రభాకర్, నివాళులర్పించారు.

భాస్కరరావుకు నివాళి

కావలి: 26వ వార్డుసౌత్ జనతాపేటకు చెందిన టీచర్ ప్రతాప్ తండ్రి గూడల బాస్కరరావు అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నకిలీ ఎన్‌వోసీకి రూ.50వేలు..

డీకేటీ పట్టాకు రూ.లక్ష..

- లింగసముద్రంతో పాటు సమీప గ్రామాల వ్యక్తుల తయారీ?
- కార్యదర్శులు, వీఆర్వోల పేరుతో సంతకాల ఫోర్జరీ..
- గుర్తించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల దృష్టికి..


లింగసముద్రం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓల పేరుతో కొంతకాలం నుంచి నకిలీ ఎన్‌ఓసీలు కుప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ నకిలీ ఎన్‌ఓసీలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంపులు వేసి అడిగిన వారికి ఇస్తున్నారు. నాలుగైదు నెలలు ఈ నకిలీ ఎన్‌ఓసీలు వస్తున్నాయి. వీటిని తయారు చేసే వారు లింగసముద్రంతో పాటు సమీపగ్రామాలకు చెందిన వ్యక్తులు తయారు చేస్తున్నట్లుగా తెలిసింది. ముఖ్యంగా లింగసముద్రంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఏర్పాటు చేసిన తరువాత ఆ బ్యాంకులో ఇంటిపై రుణం తీసుకొనేందుకు ఈ నకిలీ ఎన్‌ఓసీలు కన్పిస్తున్నాయి.

- ఇందిరమ్మ, ఎన్టీఆర్ గృహాలపై ఇంటి రుణం కోసమే..

ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇందిరమ్మ, ఎన్టీఆర్ పథకాలతో నిర్మించిన ఇంటి స్థలపట్టాలు రిజిస్ట్రేషన్ కావు. వీటితో ప్రైవేటు బ్యాంకులో ఇంటిపై రుణం తీసుకొనేందుకు ఇంటి యజమానులు నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసే వారిని ఆశ్రయిస్తున్నారు. వీరు సదరు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు వాటి సర్వే నంబర్లు వేయకుండా గ్రామకంఠం సర్వే నంబర్లు వేసి, మిగిలిన పత్రాలను కూడా నకిలీవి సృష్టించి, కందుకూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ ఎన్‌ఓసీల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని సదరు ప్రైవేటు బ్యాంకులో రూ.3 నుంచి రూ.4.50 లక్షల వరకు అధిక వడ్డీలపై రుణం తీసుకుంటున్నారు.

- ఇంటి కొలతలు వేసినందుకు రూ.50 వేలు

అయితే నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసి ఇవ్వడానికి.. ఇంటి కొలతలు వేసేందుకు నకిలీ రాయుళ్లకు రూ.50వేలు, రిజిస్ట్రేషన్ కోసం మరో రూ.20 వేలు నుండి 30 వేల వరకు వసూలు



లింగసముద్రంలో ఇచ్చిన నకిలీ ఎన్‌వోసీ

చేస్తున్నారు. అయితే వారంరోజుల కిందట ఈ నకిలీ ఎన్‌ఓసీలను ఓ వీఆర్‌ఓ, కార్యదర్శి దృష్టికి రావడంతో వారు ఆ పత్రాలను, అందులోని తమ సంతకాలు, స్టాంపులను చూసి అవాక్కయ్యారు. వెంటనే వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఎవరైనా ఇంటి రిజిస్ట్రేషన్లకు వస్తే తమ దృష్టికి తేవాలని చెప్పినట్లు తెలిసింది.

- డీకేటీ పట్టా తయారీ జోరుగా..

5ఎకరాల డీకే పట్టా ఇస్తే రూ.లక్ష తీసుకుంటున్నారు. మూడునెలల కిందట గుడ్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 10మంది మహిళలకు ఈ నకిలీ డీకే పట్టాలిచ్చి రూ.10లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇవి నకిలీవని తేలడంతో మోసపోయామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మకూరులో మళ్లీ 'ఆనం' మార్కు అభివృద్ధి



సహపంక్తి భోజనంలో పాల్గొన్న మంత్రి సవిత, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలం తరువాత ఆత్మకూరు మున్సిపాలిటీలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు బీజం పడింది. దేవదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూ.కోట్ల విలువయిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగ్గా, ఐదుగురు రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు తరలి వచ్చారు. దీంతో పట్టణంలో ఎటూ చూసిన సందడి నెలకొంది. కార్యక్రమాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.వెంకట రమణమ్మతోపాటు ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.



ఆత్మకూరు పర్యటనకు వచ్చిన మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్, సవిత, తదితరులు

పాఠశాలకు ఉచితంగా పెయింట్స్

ఉలవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఐదు తరగతి గదులకు సామాజిక సేవలో భాగంగా ఇండిగో పెయింట్స్ కంపెనీ నిర్వాహకులు ఆదివారం రంగులు వేశారు. రూ.1.20లక్షల విలువ చేసే ఈ పెయింట్‌ను మండలంలోని 100 మంది పెయింటర్స్ సహకారంతో ఒక్కరోజులో పూర్తి చేసినట్లు ఇండిగో సంస్థ రాష్ట్ర బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, స్థానిక డీలర్ శ్రీనివాసులు చెప్పారు. ఈ సందర్భంగా వారికి ఎస్ఎంసీ చైర్మన్ వాయల తిరుపతిరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, శరత్‌లు సంస్థ ఉద్యోగులను శాలువాతో సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు
- శుంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల్లో బిజీ

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కళ్లవళ్లలో రూ.27లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు, రూ.4.61లక్షలతో నిర్మించిన గోకులం షెడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కళవళ్ల గ్రామ సచివాలయం నుంచి లింగసముద్రం మండలం వీఆర్.కోటకు రూ.2కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణ పనులకు శుంఖుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కనెక్టివిటి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 15న కందుకూరుకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘనంగా స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ చంద్రమౌళి, పార్టీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం మాదాల రవికుమార్, గొంది నరసింగరావు, పొడపాటి మహేష్, సోమినేని రవీంద్ర, సోమినేని కొండలరావు, మోదపల్లి నారాయణ, వంకాయలపాటి మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు పలు గామాల్లో శుంకుస్థాపనలు

మండలంలోని రోళ్లపాడు. కొండసముద్రం పోకూరు గ్రామాల్లో తారురోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ చంద్రమౌళి తెలిపారు.

సీఎం ఘన స్వాగతానికి ఏర్పాట్లు

- కందుకూరు: పట్టణంలో ఈ నెల 15న జరుగనున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం కొండముడుసుపాలెంలో సచివాలయం సమీపంలో కేజీటీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా తిరిగి కేజీటీ రోడ్డులోకి ఉన్న ప్రధాన రహదారిని తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు మాదాల రవికుమార్, నరసింగరావు, కోటేశ్వరమ్మ, మహేష్, కొండలరావు పాల్గొన్నారు.



కందుకూరు: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

- ఉలవపాడు:కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ నుంచి ఆత్మకూరు పంచాయతీని కలుపుతూ రాజుపాలెంకు వెళ్లే అంతర్గత తారు రోడ్డు(బీటీ) పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.50లక్షల ఉపాధి నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సిమెంటు రోడ్లు, అంతర్గత బీటీ రోడ్లు నిర్మాణంలో రాజీపడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆకాంక్ష మేరకు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన నిధులతో రోడ్లు వేసే అవకాశాలను పరిశీలించాలని పంచాయతీరాజ్ ఏఈ జేవీ రమణమూర్తిని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ నాశం గోవిందమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాఖాహార ర్యాలీ

వింజమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి కేంద్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ కరుణ పాల్గొన్నారు. విద్యుల్లత మాస్టర్ జన్మదినం సందర్భంగా శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ మండల కేంద్రంలోని పిరమిడ్ నగర్, వైశ్యబజార్, ఎర్రబెల్లిపాలెం వీధుల మీదుగా మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుజిత, హేమలత, రాజేశ్వరి, స్వరాజ్యం, జయప్రద, లక్ష్మీ, హజరత్, జానకిరాంరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

సత్తెమ్మకు పొంగళ్లు



పూజా సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

కలువాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట గ్రామస్థులు ఆదివారం గ్రామదేవత సత్తెమ్మకు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, పాడి పంటలతో కళకళలాడాలని కోరుతూ గ్రామదేవతకు ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ. సత్తెమ్మ ఆలయంలో అమ్మవారి ప్రతిమను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలంతా కలసి పూజా సామగ్రిని కొత్త గంపల్లో నెత్తి మీద పెట్టుకుని మేళ తాళాలతో బాణసంచా కాల్చుకుంటూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు. మండలంలోని గ్రామాల భక్తులు దర్శించుకున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు ఆదివారం రాష్ట్ర మంత్రుల సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఒకటవ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, 5వ వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, 14వ వార్డు కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రెండవ వార్డు కౌన్సిలర్ శివకోటారెడ్డికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. వీరిని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పాల్గొన్నారు.



మంత్రుల సమక్షంలో చేరిన కౌన్సిలర్లు

పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ కలయిక

కావలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1974-75 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారకానాద్ చౌదరి ఆధ్వర్యంలో స్నేహితులు కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 60మంది వరకు సమావేశంలో పాల్గొన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ యోగక్షేమాలను తెలుసుకుంటూ 50 ఏళ్ల నాటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు. సమావేశంలో ఆనాటి గురువులను సత్కరించారు. భౌతికంగా లేనివారిని స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గోపాల్‌రెడ్డిలు చొరవ తీసుకుని కృషితో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.



50ఏళ్ల తరువాత కలుసుకున్న విశ్వోదయ పూర్వ విద్యార్థులు

మహా కుంభమేళా పవిత్రజలం పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆదివారం పట్టణంలోని హనుమాన్ భజరంగీ సెంటర్, హరిణి ప్రజావేదృశాల, ఏకలవ్య నగర్ రామాలయం, ఉప్పుచెరువు రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద మహాకుంభ మేళా పవిత్ర అమృతజలాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రతినిధి మల్లికార్జునరావు మాట్లాడారు. కుంభమేళాకు వెళ్లలేని వారు ఈ జలాలను నెత్తిన చల్లుకుంటే మహాకుంభ్‌లో నదీస్నానం చేసిన పుణ్యం దక్కుతుందన్నారు. సోమవారం కూడా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంల గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, మువ్వల భూషయ్య, యు. కొండపనాయుడు, ఉమామహేశ్వరరావు, పొడపాటి చక్రి, వైకుంఠం, చక్కా కేశవ పాల్గొన్నారు.



జలాలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు, నాయకులు

అసంపూర్తి భవనాలకు మోక్షం ఎప్పుడో..?

- తరగతులు ఐదు.. గదులు రెండు
- అవస్థల నడుమ విద్యాబోధన

సంగం, ఫిబ్రవరి 9:మండలంలో అసంపూర్తి నిర్మాణాలతో నిరుపయోగంగా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న భవనాలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అందులో ఒకటి ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనం. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం మండల కేంద్రం సంగంలోని రాళ్లచెలిక ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గది. పాఠశాలలో ఐదు తరగతులు.. 65 మందికి పైగా విద్యార్థులున్నారు. రెండుగదులు, వరండాలో విద్యా బోధనకు ఇబ్బందిగా ఉంది. దీన్ని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వంలో అదనపు తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. స్థానిక నాయకుడు భవన నిర్మాణ పనులను చేపటారు. లెంటల్ వరకు పూర్తి చేశారు. బిల్లులు అప్‌లోడ్ చేశారు. నిధుల కొరతతో బిల్లులు మంజూరుకాలేదు. ఇంతలో 2019లో ఎన్నికలు రావడంతో అదనపు తరగతి గది నిర్మాణం ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ గెలిచింది. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను వైసీపీ నిలిపివేచింది. దీంతో బిల్లులు మంజూరు కాలేదు. వైసీపీ నాడు నేడు పేరుతో కొత్త పాఠశాలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేశారే గానీ అసంపూర్తిగా ఉన్న పనులను పట్టించుకోలేదు. దీంతో టీడీపీ హయాంలో చేపట్టిన అదనపు తరగతి గది నిర్మాణం ఐదేళ్ల అసంపూర్తిగానే మిగిలిపోయింది.



అసంపూర్తిగా అదనపు తరగతి గది నిర్మాణం

- కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా..

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా ఆగిపోయి అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణం మొండి గోడలతో ఎక్కిరిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని అధికారులు, పాలకులు చెబుతున్నారు. ఈ క్రమంలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

సంగం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెంలో నెల్లూరు రమణమ్మ అనే వృద్ధురాలికి చెందిన పూరిల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. ఆ ఇంట్లో రమణమ్మ ఒక్కటే నివాసం ఉంటుంది. ఆదివారం ఉదయం ఆమె నెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు ఏర్పడ్డాయి. దీంతో ఇంట్లోని సామాన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న బాధితురాలు తిరిగి ఇంటికి చేరుకుని సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని లబోదిబోమంటుంది. ప్రభుత్వం స్పందించి కట్టుబట్టలతో మిగిలిన వృద్ధురాలిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దగ్ధమైన పూరిల్లు

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు

- బీఎన్‌జీ. ఆజంఖాన్, ఏపీవో

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):అన్నిపంచాయతీల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు కల్పిస్తామని వలసల నివారణకు తమవంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటావని ఏపీవో ఆజంఖాన్ తెలిపారు.



? ఉపాధి పనులు జరుగుతున్నాయా.

! 24పంచాయతీల్లో ప్రస్తుతం 18పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. మిగిలిన వాటిల్లోనూ పనులు జరిగేలా సిబ్బందికి సూచనలిచ్చాం.

? సిబ్బంది కొరత ఉందా.

! ప్రస్తుతం 5మంది రెగ్యులర్ ఎఫ్ఏలు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియమిస్తాం.

? లక్ష్య సాధనకు ఏ చర్య తీసుకుంటారు.

! ప్రభుత్వ నిర్దేశాల మేరకు ప్రతిరోజూ 4వేల కూలీలు లక్ష్యం కాగా ప్రస్తుతం 2వేల మంది పనులకు వస్తున్నారు. వ్యవసాయ పనులు సాగుతుండడంతో కూలీల సంఖ్య తగ్గుముఖం పడుతుంది.

? నగదు గిట్టుబాటు అవుతుందా.

! నూతన ప్రభుత్వం రోజువారీ కూలిని రూ.300కు పెంచింది. కూలీలు ఆశించిన మేర పనులు చేయకపోవడంతో సరాసరి రూ.240 వరకు గిట్టుబాటు అవుతుంది.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు, ఆ ప్రాంతవాసులతో కలిసి ఆదివారం స్థానిక ట్యాంక్‌బండ్‌పై కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. గతేడాది వర్షాలు కూడా తక్కువగా కురవడంతో ఇప్పటికే చెరువుల్లో అరకొరగా ఉన్న నీరు అడుగంటి పోతుందన్నారు. సాగు చేసిన పంటలు చేతికందుతాయో లేదోఅన్న ఆందోళన రైతుల్లో నెలకొందన్నారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి దొరకడం కష్టమే అని వాపోయారు. అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అపస్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

- 907 మంది విద్యార్థుల హాజరు



అనంతసాగరం : బహుమతులు అందుకున్న విద్యార్థిని, విద్యార్థులు

అనంతసాగరం ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నిర్వహించిన 10వ తరగతి ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సంగం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల, ఆత్మకూరు, కలువాయి మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుంచి 907 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి టాప్ 10విద్యార్థులను గుర్తించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్‌రెడ్డి, అపస్ రాష్ట్ర నాయకులు చక్రపాణి, రాజగోపాలాచార్యులు, అనిల్‌కుమార్, వెంకయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వింజమూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆది వారం యూటీఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి వెలుగోటి రాములు పాల్గొని ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి శర్మ, బాలరాఘవులు, చెంచలబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.



వింజమూరు : బహుమతులతో విద్యార్థులు